ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



పిల్లల్లో ఫోన్ అడిక్షన్
మారం చేయకుండా అన్నం తింటారనో,
అల్లరి చేయకుండా ఉంటారనో...
పిల్లల చేతికి సెల్ ఫోన్ ఇస్తున్న తల్లిదండ్రులు
- అది చాలా ప్రమాదమంటున్న వైద్యులు
- వివరాలు 8వ పేజీలో



అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

జిల్లాను రాష్ట్రంలో ఆదర్శంగా నిలపాలి
ఎంపీ సీఎం రమేశ్

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- మండలానికో అధికారిని నియమించి బాధ్యతలు అప్పగించాలి
- స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- పథకాల అమలుపై విస్తృత చర్చ
- ప్రతి గ్రామానికి రహదారి
- నాన్ షెడ్యూల్ ఏరియాలోని గిరిజనులకు షెడ్యూల్ ఏరియాలోని పథకాలు వర్తింపు
- ప్రతి మండలం నుంచి ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన 200 మందికి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ
- అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు


సమీక్ష జరుపుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎంపీ సీఎం రమేశ్. చిత్రంలో ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేశ్‌బాబు, కేఎస్ఎన్ఎస్ రాజు, సుందరపు విజయకుమార్, కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా, జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ప్రగడ నాగేశ్వరరావు

అనకాపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి):
కేంద్ర ప్రభుత్వ పథకాలు అర్హులైన అన్ని వర్గాల ప్రజలకు అందితేనే అభివృద్ధి సాధ్యమని, పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేసి జిల్లాను రాష్ట్రంలో ఆదర్శంగా నిలపాలని ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం 38 శాఖల ద్వారా అమలు చేస్తున్న 58 రకాల పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా డెవలప్‌మెంట్ కో-ఆర్డినేషన్, మోనటరింగ్ కమిటీ (దిశ) సమీక్ష సమావేశాన్ని శనివారం స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యేలు, ఎంపీపీలతో కలిసి ఆయన నిర్వహించారు. సమావేశంలో జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ఆధ్వర్యంలో చేపట్టాల్సిన అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు అవసరమైన నిధుల ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 58 రకాల పథకాలు, వాటిని క్షేత్రస్థాయిలో ఏ విధంగా అమలు చేయాలనే దానిపై అధికారులకు సీఎం రమేశ్ దిశానిర్దేశం చేశారు. జిల్లా, నియోజకవర్గ, గ్రామస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరికీ అందించే బాధ్యత తీసుకోవాలన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా, కనీసం దరఖాస్తు ఎలా చేసుకోవాలో తెలియక అనేకమంది పేదలు పథకాలను పొందలేకపోతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం గ్రామస్థాయిలో పథకాలపై ప్రచారం చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు చాలా వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంటుందని, దీంతో అనేక మంది అవగాహన లేక లబ్ధి పొందలేకపోతున్నారన్నారు. కలెక్టర్ చొరవ తీసుకొని పథకాలపై ప్రజలకు అవగాహన, ప్రచారం కల్పించేందుకు ప్రతి మండలానికి ఒక అధికారిని నియమించి బాధ్యతలు అప్పగించాలని సూచించారు. సమావేశానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు, పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయ్‌కుమార్, కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద సత్యనారాయణ, మళ్ల సురేంద్ర, ప్రగడ నాగేశ్వరరావులు హాజరై కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు తమ వంతు సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశానికి కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా, జిల్లాలో వివిధ మండలాల ఎంపీపీలు, అధికారులు హాజరయ్యారు.

సమావేశంలో చర్చించిన అంశాలు

- రోడ్డు సదుపాయం లేని ప్రతి గ్రామానికి రహదారి నిర్మించాలి. 20 ఏళ్ల కిందట వేసిన సిమెంట్ రోడ్లను మళ్లీ వేసేందుకు అవసరమైన ప్రతిపాదనలను త్వరితగతిన రూపొందించాలి.
- నాన్ షెడ్యూల్ ఏరియాలో వున్న గిరిజనులకు కూడా షెడ్యూల్ ఏరియాలో అమలు జరుగుతున్న పథకాలు వర్తింపజేయాలి.
- ప్రతి గ్రామంలో రోడ్లతోపాటు డ్రైనేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలి.
- అంగన్‌వాడీ కేంద్రాల సొంత భవనాల నిర్మాణాలు, పాఠశాలలకు ప్రహరీల నిర్మాణ పనులు, జిల్లాలో మరమ్మతులకు గురైన 182 పాఠశాల భవనాలకు మరమ్మతులు చేపట్టాలి.
- ప్రతి మండలం నుంచి ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన 200 మంది యువతీ, యువకులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇవ్వాలి.
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మంజూరైన గృహ నిర్మాణాలను పూర్తి చేయాలి. గతంలో అనర్హులకు కేటాయించిన గృహాలు రద్దు చేయాలి.
- ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ప్రతి ఒక్కరికి ఆరోగ్య కార్డులు పంపిణీ చేయాలి.
- అనకాపల్లిలో 2025 మార్చి నాటికి డయాలిసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి.
- ముద్ర, ఎస్ఎస్ఎం పథకాల ద్వారా వ్యాపారాలు చేసుకొనేందుకు యూనిట్ల ఏర్పాటుకు ఏడాదిలో లక్ష మంది లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలి.
- అనకాపల్లి నుంచి అగనంపూడి రోడ్డు నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలి. ఫ్లైఓవర్ల నిర్మాణాలకు డీపీఆర్‌లు రూపొందించాలి.
- అవసరమైన దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేయాలి. సదరం నకిలీ సర్టిఫికెట్లు జారీ చేసిన వైద్యులపై చర్యలు తీసుకోవాలి.

అన్నదాతల్లో గుబులు

ఓ వైపు తుఫాన్ హెచ్చరికలు


రెల్లరాల్చు తెగులుతో దెబ్బతింటున్న పంట


మాకవరపాలెంలో కోతకు సిద్ధంగా ఉన్న ఆర్‌జేఎల్ వరి పంట

- మరో వైపు వరి పంటకు తెగుళ్ల బెడద
- వర్షాలు కురిస్తే పంటపై ఆశలు వదులుకోవలసిందేనని రైతుల ఆవేదన

అనకాపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి):
జిల్లాలో వరి కోతలు ప్రారంభమవుతున్న తరుణంలో రైతుల్లో అలజడి నెలకొంది. ఓ వైపు వరి పంటకు తెగుళ్ల బెడద, మరో వైపు తుఫాన్ హెచ్చరికలతో ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో ఈ ఏడాది వరి పంట ఆశాజనకంగా పండింది. కొద్ది రోజుల్లో పంట చేతికి వస్తుందనగా తుఫాన్ హెచ్చరికలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడనుంది. దీని ప్రభావంతో ఈ నెల 26, 27 తేదీల్లో రెండు రోజులపాటు జిల్లాలో అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో జిల్లాలో వరి కోతలకు సిద్ధమవుతున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. అల్పపీడన ప్రభావంతో ప్రజలు, రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఇప్పటికే జిల్లా అధికారులను ఆదేశించింది. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ వరిసాగు 52 వేల ఎకరాల్లో జరిగింది. ఆలస్యంగా నాట్లు వేయడం, ఆర్‌జేఎల్ రకం వరి విత్తనాలను రైతులు వాడడం వంటి కారణాలతో ఇప్పటి వరకు వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం జిల్లాలో కేవలం 5 వేల ఎకరాలు మాత్రమే వరి కోతలు జరిగాయి. కొన్ని మండలాల్లో వరి కోతలు ఇప్పుడిప్పుడే ప్రారంభమయ్యాయి. కోతల సమయంలో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జి.మోహన్‌రావు సూచిస్తున్నారు. వరి కోతలు వాయిదా వేసుకోవాలని తెలిపారు. మండల వ్యవసాయాధికారులు రానున్న మూడు రోజులు మండల కేంద్రాల్లో ఉండి రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని ఆదేశించారు. వరి కోతలు జరుగుతున్న మండలాలతో పాటు పొట్టదశలో వరి వున్న ప్రాంతాల్లో వరి కోతలు కొద్ది రోజుల పాటు వాయిదా వేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

తెగుళ్ల బెడదతో సతమతం

మాకవరపాలెం: మండలంలో ఈ ఏడాది 4,200 వేల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. అత్యధికంగా సుమారు 3,000 ఎకరాల్లో ఆర్‌జేఎల్(శ్రీకాకుళం సన్నాలు) వంటి వరి రకం వేశారు. ఆర్‌జేఎల్ రకం వరి సాగుకు మండల వ్యాప్తంగా కోతలు ప్రారంభించారు. ఈ క్రమంలో ఆర్‌జేఎల్ వరి రకంపై రెల్లరాల్చు పురుగు దాడి చేస్తోంది. వరి వెన్నులను కొరికివేయడంతో పంటకు తీవ్ర నష్టం కలిగిస్తున్నది. పంట అంతా నేలపాలవుతోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. కాగా తుఫాన్ కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేయడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో వర్షాలు కురిస్తే పండిన పంటపై ఆశలు ... మిగతా 8వ పేజీలో

29న ప్రధాని రాక ఖరారు

ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో బహిరంగ సభ

- విమానాశ్రయం నుంచి రోడ్‌షో
- ఇక్కడ నుంచి వర్చువల్‌గా ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుకు శంకుస్థాపన



విశాఖపట్నం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి):
ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 29న విశాఖపట్నం వస్తున్నారు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు విమానాశ్రయంలోని ఐఎన్ఎస్ డేగాలో దిగి రోడ్ షో చేసుకుంటూ మద్దిలపాలెంలోని ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానానికి చేరుకుంటారు. అక్కడ నుంచే అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడకలో ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు నిర్మాణానికి వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారు. అనంతరం బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ప్రధాని పర్యటన, బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించేందుకు కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్ ఆదివారం ఉదయం 10.30 గంటలకు జిల్లా ప్రజా ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రధాని పర్యటన పూర్తి షెడ్యూల్ ఇంకా రావలసి ఉంది.

ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేయాలి

- ఎంపీ సీఎం రమేశ్

అనకాపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 29న విశాఖపట్నం రానున్నారని, ఆ పర్యటనను విజయవంతం చేయాలని ఎంపీ సీఎం రమేశ్ కోరారు. కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో ఆయన ... మిగతా 8వ పేజీలో

15,287

ఇదీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల ముసాయిదా జాబితాలోని ఓటర్ల సంఖ్య



- పురుషులు 9,638, మహిళలు 5,647 మంది
- వచ్చే నెల తొమ్మిదో తేదీ వరకూ అభ్యంతరాల స్వీకరణ, ఓటరుగా నమోదుకూ అవకాశం
- వచ్చే నెల 30న తుది ఓటర్ల జాబితా

విశాఖపట్నం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి):
ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలి నియోజకవర్గ ఓటర్ల ముసాయిదా జాబితా శనివారం విడుదల చేశారు. ఆరు జిల్లాల పరిధిలో 15,287 మంది ఓటర్లుగా నమోదయ్యారు. వీరిలో 9,638 మంది పురుషులు, 5,647 మంది మహిళలు ఉన్నారు. ఓటు నమోదుకు 17,404 దరఖాస్తులు రాగా 2,117 తిరస్కరించి, 15,287 మందితో ముసాయిదా జాబితా రూపొందించారు. అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాలో 3,906 మంది టీచర్లు ఓటర్లుగా నమోదయ్యారు. మహిళా ఉపాధ్యాయ ఓటర్ల వివరాలు పరిశీలిస్తే విశాఖపట్నం జిల్లాలో అత్యధికంగా 1,421 మంది ఉండగా, అతి తక్కువగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 527 మంది ఉన్నారు. కాగా ముసాయిదా ఓటర్ల జాబితాపై శనివారం నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, విశాఖపట్నం కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ తెలిపారు. వచ్చే నెల తొమ్మిదో తేదీ వరకు అభ్యంతరాలను ఆన్‌లైన్‌లో అయితే 'సీఈవో ఆంధ్రా.ఎన్ఐసీ.ఇన్'కు లేదా ఆఫ్‌లైన్‌లో అయితే సంబంధిత ఓటరు నమోదు అధికారి, సహాయ నమోదు అధికారికి నిర్ణీత దరఖాస్తు ఫారంలో అందజేయాలని సూచించారు. ఇంకా కొత్తగా ఓటరుగా నమోదుకు లేదా ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేని ఉపాధ్యాయులు వచ్చే నెల తొమ్మిదో తేదీలోగా తమ దరఖాస్తులు అందజేయవచ్చునన్నారు. ఈనెల ఒకటో తేదీ నాటికి ఆరేళ్ల ముందు మాధ్యమిక పాఠశాలకు తక్కువకాని విద్యా సంస్థలో కనీసం మూడేళ్ల పాటు బోధనానుభవం ఉండాలని, అందుకు సంబంధించిన ధ్రువీకరణపత్రం, ఇతర డాక్యుమెంట్లు అంటే నివాస ధ్రువపత్రం, పాస్ పోర్టు ఫొటో జత చేసి ఫారం-19 సమర్పించాలన్నారు. కాగా అభ్యంతరాలు పరిష్కరించి వచ్చే నెల 30న తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

ముసాయిదా ఓటర్ల జాబితా

జిల్లా	పురుషులు	మహిళలు	మొత్తం ఓటర్లు
శ్రీకాకుళం	2,725	1,181	3,906
విజయనగరం	2,164	1,261	3,425
పార్వతీపురం మన్యం	1,267	595	1,862
విశాఖపట్నం	1,426	1,421	2,847
అనకాపల్లి	1,225	664	1,889
అల్లూరి	831	527	1,358
మొత్తం	9,638	5,647	15,287

పింఛన్‌దారులకు భరోసా

- లబ్ధిదారుడు మృతి చెందితే అతని భార్యకు మరుసటి నెల నుంచే పింఛన్
- ఉత్తర్వులు జారీ చేసిన కూటమి ప్రభుత్వం

అనకాపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి):
సామాజిక పింఛన్ పొందుతున్న వ్యక్తి మృతి చెందితే అతని భార్యకు మరుసటి నెల నుంచే పింఛన్ ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు విడుదలయ్యాయి. ఇంటి పెద్ద ఒక నెలలో 15వ తేదీ కంటే ముందుగా మృతి చెందితే అతని భార్యకు మరుసటి నెల నుంచే పింఛన్ అందుతుంది. 15వ తేదీ తరువాత మరణిస్తే రెండో నెల నుంచి వర్తిస్తుంది. జిల్లాలో సామాజిక పింఛన్లు ... మిగతా 8వ పేజీలో

పరాయి పంచన ప్రభుత్వ కార్యాలయాలు

నర్సీపట్నం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి):
ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేక ఏళ్ల తరబడి అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. దీంతో చాలీచాలని గదుల్లో, అసౌకర్యాల నడుమ అధికారులు, ఉద్యోగులు విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్నారు.


బ్యాంక్ కాలనీలో ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయం

ఏళ్ల తరబడి అద్దె భవనాల్లో నిర్వహణ

- సరైన సౌకర్యాలు లేక అధికారులు, ఉద్యోగుల ఇబ్బందులు
- అద్దెల రూపంలో రూ.లక్షలు ప్రభుత్వానికి వ్యయం

నర్సీపట్నంలో ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయం, ఎక్సైజ్ కార్యాలయం, డివిజనల్ గృహ నిర్మాణ శాఖ కార్యాలయం, గనులు, భూగర్భ శాఖ, తూనికలు కొలతలు శాఖ డివిజనల్ కార్యాలయాలు ఏళ్ల తరబడి అద్దె భవనాల్లోనే ఉంటున్నాయి. ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయాన్ని బ్యాంక్ కాలనీలోని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఆర్టీవో, ఇద్దరు బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు, ఒకరు అసిస్టెంట్ బ్రేక్ ఇన్‌స్పెక్టరు పని చేస్తున్నారు. కార్యాలయంలో అధికారులకు, సిబ్బందికి సరిపడా గదులు లేక ఇబ్బందులు పడుతున్నారు. రిజిస్ట్రేషన్లకు వచ్చే వాహనాలు రోడ్డు మీద, ప్రైవేటు స్థలాల్లో పార్కింగ్ చేస్తున్నారు. కేసులు రాసి సీజ్ చేసిన వాహనాలను ఆర్టీసీ డిపోలో ఉంచుతున్నారు. డ్రైవింగ్ లైసెన్స్ కోసం వచ్చేవారి డ్రైవింగ్ సామర్థ్యం పరీక్షించడానికి సరిపడా స్థలం లేదు. సొంత భవనం నిర్మించుకోవడానికి ... మిగతా 8వ పేజీలో



నర్సీపట్నంలో అద్దె భవనంలో ఎక్సైజ్ కార్యాలయం

విభేదాలు వీడి ఐక్యంగా పనిచేయండి

»» కూటమి నాయకులకు ఎమ్మెల్యే 'సుందరపు' దిశానిర్దేశం



కూటమి నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక, నవంబర్ 23 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జనసేన పార్టీ కార్యాలయంలో కూటమి నాయకులతో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ శనివారం సమావేశమయ్యారు. అతికొద్ది మందితో గోప్యంగా ఈ సమావేశం నిర్వహించినట్టు తెలిసింది. విభేదాలు వీడి అందరూ ఐక్యంగా కలిసి రావాలని పిలుపునిచ్చినట్టు సమాచారం. కూటమి శ్రేణులు మనస్పర్థలు వీడకపోతే ఆ ప్రభావం ఆయా గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులపై పడే ప్రభావం ఉంటుందని వివరించారని తెలిసింది. ఈ సమావేశంలో టీడీపీకి చెందిన దాడి ముసిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ, దొడ్డి శ్రీనివాసరావు, జనసేన పార్టీకి చెందిన ఎంపీపీ మళ్ల జయమ్మ, టెక్కలి పరశురాం, బీజేపీకి చెందిన బద్దెం సూర్యనారాయణతో పాటు కూటమికి చెందిన అతి తక్కువ మంది పాల్గొన్నట్లు తెలుస్తోంది.

'స్వచ్ఛతే సేవ'తో ప్రజల్లో సామాజిక బాధ్యత

»» జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి



మునగపాకలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది

మునగపాక, నవంబర్ 23 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రతకు అంతా అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి అన్నారు. స్వచ్ఛతే సేవలో భాగంగా మునగపాకలో శనివారం వివిధ శాఖల అధికారులతో కలిసి చీపురు చేతపట్టి రోడ్డుపై చెత్తాచెదారాన్ని, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుండడం వల్ల ప్రజల్లో సామాజిక బాధ్యత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంపద కేంద్రాల జిల్లా కో-ఆర్డినేటర్ నాగలక్ష్మి, ఎంపీడీవో ఎం.ఉషారాణి, ఈవోపీఆర్డీ సోమరాజులతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రాంబిల్లి : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యతని ఈవోపీఆర్డీ రాజు అన్నారు. రాంబిల్లి, హరిపురం గ్రామాల్లో స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖల అధికారులతో కలిసి పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని సచివాలయాలు, ప్రధాన సెంటర్లలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని అంతా కలిసి తొలగించారు. హరిపురం సర్పంచ్ బుజ్జి, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.



రాంబిల్లి జంక్షన్‌లో...

నేడు ఏటికొప్పాకలో బండిమాంబ జాతర

»» భారీ ఏర్పాట్లు చేపట్టిన నిర్వాహకులు »» 150 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు »» గ్రామంలో ట్రాఫిక్ ఆంక్షలు



ఏటికొప్పాకలో కొలువుదీరిన బండిమాంబ



జాతర సందర్భంగా ఏటికొప్పాకలో ఏర్పాటు చేసి వివిధ రకాల ఆటల పరకరాలు

ఎలమంచిలి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో ఒకటైన మండలంలోని ఏటికొప్పాక బండిమాంబ జాతర ఆదివారం అత్యంత ఘనంగా జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఆలయంతో పాటు గ్రామంలోని వీధుల్లో విద్యుద్దీపాంకరణ చేపట్టారు. ప్రధాన ద్వారం వద్ద భారీ సెట్టింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. తెల్లవారు నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలి రానుండడంతో బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఈ జాతరకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా బాణసంచాను వరహానది ఒడ్డున కాల్చనున్నారు. అమ్మవారి దర్శనానికి ఎమ్మెల్యే, ఎంపీలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు తరలి రానున్న నేపథ్యంలో సుమారు 150 మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే గ్రామంలో సాయంత్రం నుంచి ట్రాఫిక్ ఆంక్షలను విధించినట్టు రూరల్ ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు. ఇదిలావుంటే, బండిమాంబ అమ్మవారికి శుక్రవారం రాత్రి సారెను సమర్పించారు. తొలుత గ్రామంలోని మహిళలు తమ ఇళ్ల వద్ద తయారు చేసిన వివిధ రకాల పిండివంటలను పళ్లాల్లో పేర్చి భారీ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



శుక్రవారం రాత్రి సారె ఊరేగింపు

పాటిపల్లిలో రామలింగేశ్వర కల్యాణం రేపు



రాటోత్సవంలో పాల్గొన్న భక్తులు

మునగపాక, నవంబర్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాటిపల్లి గ్రామంలో గల రామలింగేశ్వరస్వామి (లింగరాయి) ఆలయంలో ఈ నెల 25న వార్షిక కల్యాణోత్సవం జరగనుంది. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు, పెద్దలు అంతా కలిసి శనివారం ఉత్సవ రాటను వేశారు. ఆరోజు ఉదయం నుంచి స్వామివారికి విశేష పూజలు నిర్వహించనున్నట్టు చెప్పారు. మధ్యాహ్నం అన్నసమారాధనే, సాయంత్ర గ్రామ పురవీధుల్లో ఉత్సవ విగ్రహాలు, సారె ఊరేగింపు ఉంటాయన్నారు.

ముఠా కార్మికులకు చట్టం చేయాలి

అచ్యుతాపురం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ముఠా కార్మికులకు సమగ్ర చట్టం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. సెజ్ పరిధిలో గల ముఠా కార్మికులతో శనివారం ఆయన ఇక్కడ సమావేశమయ్యారు. రెక్కల కష్టంపై ఆధారపడి జీవించే ముఠా కార్మికులకు ఎటువంటి చట్టాలు అమలు కావడం లేదన్నారు. ఈ నెల 26న జరిగే ఆందోళన కార్యక్రమంలో అంతా పాల్గొనాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి బాబా జయంతి



ఎలమంచిలిలోని సత్యసాయి మందిరంలో భక్తులు పూజలు

ఎలమంచిలి, నవంబరు 23 : సత్యసాయి బాబా జయంత్యుత్సవాన్ని శనివారం ఇక్కడ అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. సత్యసాయి చిత్రపటం వద్ద ఓంకారం, సుప్రభాతం వంటి కార్యక్రమాలను ప్రారంభించి సత్యసాయి వ్రతాలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. రాత్రి జ్వాలా ఉత్సవం జరిపారు.

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో సత్యసాయి జయంత్యుత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము ఐదు గంటలు నుంచి గ్రామ పురవీధుల్లో నగర సంకీర్తన చేపట్టారు. హారితి వెలుగుల్లో సత్య సాయి బాబా చిత్రపటాన్ని ఊరేగించారు. అనంతరం మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసమారాధన ఏర్పాటైంది. సాయంత్రం బాల వికాస్ పిల్లలు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భజన మండలి కన్వీనర్ సరిసా శివ గణేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో శరగడం చిన్నరమణ, మళ్ల అప్పలనాయుడు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



మునగపాక మండలం తిమ్మరాజుపేట మందిరంలో...

యూటీఎఫ్ మండల కార్యవర్గం

»» అధ్యక్షుడిగా మద్దిల నానాజీ



ప్రతిజ్ఞ చేస్తున్న కార్యవర్గ సభ్యుల

అచ్యుతాపురం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) మండల నూతన అధ్యక్షుడిగా మద్దిల నానాజీ ఎంపికయ్యారు. అచ్యుతాపురం ప్రాథమిక పాఠశాలలో శనివారం ఏర్పాటైన సమావేశంలో ఈ మేరకు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి.చిన్నబ్బాయి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షునిగా కొంకి మహిమరావు, అధ్యక్షునిగా మద్దిల నానాజీ, ప్రధాన కార్యదర్శిగా కాకిలేటి సుభాషిణీదేవి, ఉపాధ్యక్షులుగా ఆర్.రవికుమార్, మాత సూర్యలక్ష్మి, సీపీఎస్ కన్వీనర్‌గా ఈ.అరుణకుమారి, ఇతర సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి, నాయకులు జి.ఎస్.ప్రకాశ్, వి.జామవా, ఎస్.కళ్యాణరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న క్షేత్రంలో మేల్కోట జీయర్‌స్వామి



స్వామికి ప్రసాదం అందిస్తున్న అర్చకులు

నక్కపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉపమాక వేంకటేశ్వరస్వామి క్షేత్రాన్ని శనివారం కర్ణాటక రాష్ట్రం మేల్కోటకు చెందిన త్రిదండి శఠగోప ముని చిన రామానుజ జీయర్‌స్వామి దర్శించుకున్నారు. మేల్కోటలో ప్రసిద్ధి ఆశ్రమానికి ఉత్తరాధికారిగా ఉన్న ఆయన ఉపమాక ఆలయానికి రాగానే ఆలయ అర్చకులు, సిబ్బంది ఆలయ మార్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. కింద ఆలయంలో వున్న ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని, క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామిని ఆయన దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు పీసపాటి శేషాచార్యులు ఆలయంలో పూజలు చేశారు. అనంతరం స్వామివారి శేష వస్త్రంతో ఆలయ అర్చకులు ఆయన్ని సత్కరించి ప్రసాదాలు, పండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు, నందూరి రాజ గోపాలాచార్యులు, నున్న సుభాష్, పవన్‌కుమార్, ఆచార్యులు పాల్గొన్నారు.

మండల కార్యాలయాన్ని సందర్శించిన సీఈవో



కార్యాలయాన్ని పరిశీలిస్తున్న సీఈవో

ఎస్.రాయవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయాన్ని జడ్పీ సీఈవో నారాయణమూర్తి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాగా, పదేళ్ల క్రితం ఇదే కార్యాలయంలో ఎంపీడీవోగా విధులు నిర్వహించిన నారాయణమూర్తి, ప్రస్తుతం సీఈవో హోదాలో సందర్శించడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

అపార్‌ను వేగవంతంగా పూర్తిచేయండి

జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు

ఎస్.రాయవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అపార్ నమోదు కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి పొన్నాన అప్పారావు ఆదేశించారు. పెదగుమ్ములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులంతా ఒత్తిడిని జయించి పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా చదువుకోవాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అపార్ నమోదు ప్రక్రియను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సలహాలు ఇచ్చారు.

పోరాట యోధుడు భగవాన్ బిర్సాముండా

పాయకరావుపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భగవాన్ బిర్సాముండా ఆదివాసీల కోసం బ్రిటిష్‌వారితో విరోచితంగా పోరాడిన యోధుడని ఎంఈఓ కేఎన్.గాంధీ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జాతీయ గౌరవ్ పక్వారా కార్యక్రమంలో భాగంగా శనివారం స్వాతంత్ర్య సమర యోధుడు భగవాన్ బిర్సాముండా పోరాటాలను, ప్రజలను చైతన్యపరిచేందుకు చేపట్టిన కార్యక్రమాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జాన్‌ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో సత్యసాయి జయంతి

నక్కపల్లి, నవంబరు 23: మండల కేంద్రంలో సత్యసాయి జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఓంకారం, సుప్రభాత సేవలు, అనంతరం సత్యసాయి చిత్రపటంతో నగర సంకీర్తన చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. భజన మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

కన్నులపండువగా వైభవ వేంకటేశ్వరస్వామి చక్రస్నానం

ముగిసిన కల్యాణ మహోత్సవాలు... తరలివచ్చిన భక్తులు

అలరించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు

ఎస్.రాయవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆలయ ధర్మకర్త బొలిశెట్టి గోవిందరావు, శారదాకుమారి దంపతుల ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న అలమేలుమంగ, పద్మావతి సమేత వైభవ వేంకటేశ్వర స్వామి తొమ్మిదవ దివ్య లీలా కల్యాణ మహోత్సవ వేడుకలు శనివారం కన్నుల పండువగా సాగాయి. ఉదయం చేపట్టిన పలు కార్యక్రమాలతో పాటు సాయంత్రం నిర్వహించిన గోష్ఠిగానం, ఊంజల్‌సేవతో ఘనంగా ముగిశాయి. శుక్రవారం రాత్రి వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ వైభవ వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని నేత్రపర్వంగా జరిపించారు. అనంతరం శనివారం ఉదయం ఆలయం వద్ద కొలనులో వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ గోవిందరావు, శారదాకుమారి దంపతులతో పాటు పలువురితో స్వామివారి చక్రస్నాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి ఆలయ వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేయడంతో పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో జనాలు తరలివచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన బాలికల భరతనాట్య నృత్య ప్రదర్శనతో పాటు కోలాటం చూపరలను ఆకట్టుకున్నాయి. అనంతరం పండిత సత్కారం, ఆశీర్వచనం, తీర్థప్రసాద గోష్ఠితో ఉత్సవాలు ముగిశాయి. పలు గ్రామాల నుంచి అధికంగా భక్తులు తరలిరావడంతో ఆలయం గోవింద నామంతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త మొగ్గా సీతారామయ్య, గ్రామ పెద్దలు బి.శ్రీను, కె.శ్రీను, నాయకులు పాల్గొన్నారు.



కొలనులో స్వామి వారికి చక్రస్నానం చేయిస్తున్న దృశ్యం



ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

'కూటమి ప్రభుత్వంతో గ్రామీణ రహదారులకు మహర్దశ'

పాయకరావుపేట రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామీణ రహదారులకు మహర్దశ వచ్చిందని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి అన్నారు. మండలంలోని గుంటపల్లి గ్రామంలో శనివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయన్నారు. పంచాయతీలలో పనులు చేపడదామంటే నిధులు ఉండేవి కాదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పంచాయతీలకు నిధులు విడుదల చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ గెడ్డం కన్నబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పల్లి దుర్గ, వైస్ ప్రెసిడెంట్ కె.దొరబాబు, నాయకులు ఎస్.సూరిబాబు, గణేశ్, శ్రీను పాల్గొన్నారు.

మంటలు చెలరేగి వ్యక్తికి గాయాలు

పాయకరావుపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెయిన్ రోడ్డులో హైటెన్షన్ విద్యుత్ లైన్ నుంచి మంటలు చెలరేగి ఒక వక్తికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... మెయిన్ రోడ్డులోని పాత పంచాయతీ కార్యాలయం ఎదుట ఉన్న భవనం పై అంతస్తులో నివాసముంటున్న గంటా రామచంద్రరావు శుక్రవారం రాత్రి ఇంట్లోకి చెత్తను పైనుంచి కిందికి వేసిన సమయంలో భవనానికి దగ్గరగా ఉన్న హైటెన్షన్ విద్యుత్ వైర్‌కు గుడ్డ తగులుకుంది. దీంతో ఒక్కసారిగా మంటల చెలరేగాయి. ఒకవైపు గుడ్డను చెతితో పట్టుకున్న రామచంద్రరావుకు మంటలు అంటుకుని గాయాలయ్యాయి. దీన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు బాధితుడిని వెంటనే తునిలోని ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల వితరణ

ఎస్.రాయవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గుడివాడ జడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులకు శనివారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. అలాగే పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్‌తో పాటు బీరువాను అందించారు. పి.శ్రీరామ్మూర్తిరాజు, జె.నారాయణరాజు వీటిని వితరణగా ఇచ్చారు. హెచ్ఎం నాగన్నదొర పాల్గొన్నారు.

'పేట'లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం



రాజుగారిబీడులో తుప్పలు తొలగిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పాయకరావుపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులు శనివారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. ఎంపీడీవో జయప్రకాశరావు, ఈవోపీఆర్డీ సిహెచ్.చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో రాజుగారి బీడులోని పలు వీధుల్లో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించి గ్రామాల్లో వెంటనే చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మాట్లాడుతూ స్వర్ణ పంచాయతీ అప్‌లోడ్, పీఎం విశ్వకర్మ, క్లాప్ మిత్ర జీతాల పెండింగ్ బిల్లుల అప్‌లోడ్, ఎన్‌పీసీఐ, హెచ్2హెచ్ జియోట్యాగింగ్ సర్వే తదితర పనులు త్వరితగతిన పూర్తిచేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో సీహెచ్‌ఆర్‌కే.వర్మ, పంచాయతీ కార్యదర్శి వైవీ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ బాధితుడికి సీఎంఆర్‌వో సాయం



బాధితుడికి ధ్రువపత్రం అందిస్తున్న నాయకులు

ఎస్.రాయవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దార్లపూడి గ్రామంలో కేన్సర్‌తో బాధపడుతున్న జవ్వాది రమణకు వైద్య నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.5 లక్షలు మంజూరైనట్టు టీడీపీ సీనియర్ నేత పోలిశెట్టి శ్రీను తెలిపారు. ఈ మేరకు రమణకు శనివారం మంజూరు ధ్రువపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హోం మంత్రి వంగలపూడి అనిత చొరవతో బాధితుడికి ఈ మొత్తం మంజూరైనట్టు చెప్పారు. దీంతో సీఎం చంద్రబాబు, మంత్రి అనితకు బాధిత కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నేతలు బి.రాము, మాణిక్యం పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం

పాయకరావుపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక ప్రాథమిక పాఠశాలలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవో 117 రద్దు, ఉపాధ్యాయ సమస్యలపై చర్చించారు. అనంతరం యూటీఎఫ్ జిల్లా కోశాధికారి రాజేశ్ ఆధ్వర్యంలో మండల నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా కోడి నానాజీ, అధ్యక్షుడిగా కట్టా శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన కార్యదర్శిగా బీవీవీ.రమణ, కోశాధికారిగా గర్లంక వెంకట సతీష్, సహాధ్యక్షులుగా కట్టా శ్రీను, ఎం.నాగరాజు, జిల్లా కౌన్సిలర్లుగా కెఎస్ఆర్‌కె.రాజు, జీవీ.గోపాలరావు, ఎం.రామలక్ష్మి, ఎ.శ్రీనివాసరావు, జేవీఎన్‌పీ.రాజేశ్, గర్లంక వాసు, మండల కార్యదర్శులుగా ఎంటీ.ఫణికుమార్, ఆదినారాయణ, ప్రసాద్, జె.చినబాబు, కోటేశ్వరి, ప్రసూనాంబ, సీపీఎస్ కమిటీ కన్వీనర్‌గా పి.ఫణీంద్రకుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్ కె.గణపతి కల్చరల్ కన్వీనర్‌గా కేవీవీ.రామారావు, ప్రచార కమిటీ కన్వీనర్‌గా డి.ఐజాక్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని జిల్లా కోశాధికారి రాజేశ్ తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి సభ్యులు అభినందనలు తెలిపారు.

సంపద కేంద్రాలను వినియోగించుకోండి: ఎంపీడీవో



సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

పాయకరావుపేట రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంపద తయారీ కేంద్రాలను వినియోగించుకోవాలని ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు సూచించారు. మండలంలోని సత్యవరం గ్రామంలో శనివారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో సచివాలయ సిబ్బందితో కలిసి చెత్తాచెదారాలను తొలగించారు. అనంతరం సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. గ్రామాలలో పారిశుధ్య పనులు చేపట్టి చెత్తాచెదారాలను చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సిహెచ్.చంద్రశేఖరరావు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విపత్తులపై అవగాహన అవసరం

నక్కపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విపత్తులపై అవగాహన అవసరమని ఎన్‌డీఆర్ఎఫ్ సీఐ వై.సత్యనారాయణ చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థినీ, విద్యార్థులకు ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ప్రమాదాల నుంచి ఎలా బయటపడాలి? అనే అంశంపై ఎన్‌డీఆర్ఎఫ్ బృందం అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ విపత్తులు రెండు రకాలుగా వుంటాయన్నారు. మానవ తప్పిదాల వల్ల జరిగే విపత్తులు, ప్రకృతి సహజమైన విపత్తులు సంభవిస్తుంటాయని చెప్పారు. ఎన్‌డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ కమాండెంట్ వీవీఎన్ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ విపత్తులు సంభవించినప్పుడు హీరోయిజం చూపించకూడదన్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

» అనకాపల్లి పార్లమెంటు సభ్యుడు సీఎం రమేష్


మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీలో ఎంపీ సీఎం రమేష్

కొత్తూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని అనకాపల్లి పార్లమెంటు సభ్యుడు సీఎం రమేష్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. మహిళల ఆర్థిక ప్రగతికి అవసరమైన పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయన్నారు. మహిళలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం శిక్షణ పొందిన 54 మంది మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. షేక్‌నూర్ బాషా షరీఫ్ అబ్దుల్ కలాం ఎడ్యుకేషన్ సొసైటీ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఓఎన్జీసీ చీఫ్ జనరల్ మేనేజర్ ఆర్ఎస్ రామారావు, డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్యామ్‌నాథ్, కార్పొరేషన్ చైర్మన్లు పీలా గోవింద సత్యనారాయణ, మళ్ళ సురేంద్ర, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, శ్రీరామ్మూర్తి, పీవీఎస్ఎన్ రాజులతో పాటు కూటమి నేతలు పాల్గొన్నారు.

'ఎన్‌సీసీతో యువతలో నాయకత్వ లక్షణాలు'



వేడుకల్లో పాల్గొన్న ఎన్‌సీసీ కెడెట్లు

అనకాపల్లి టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రింగురోడ్డులో గల డాక్టర్ హిమశేఖర్ డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం ఎన్‌సీసీ డేను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఆర్మీ, నేవీ యూనిట్లు హాజరయ్యాయి. ముఖ్యఅతిథి, కళాశాల అధ్యక్షుడు కేజే సౌరబ్ మాట్లాడుతూ యువత కర్తవ్యం, క్రమశిక్షణ, సహన స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. ఇందుకు ఎన్‌సీసీ దోహదపడుతుందని వివరించారు. కెప్టెన్ ధర్మలింగం మాట్లాడుతూ దేశ పురోగతికి నాయకత్వం వహించే సమర్థులైన పౌరులను అన్నింటా తీర్చిదిద్దేందుకు ఎన్‌సీసీ మంచి వేదికగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.శ్రీధర్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ ఎంజీ రాజ్‌కుమార్, రమణ, సీతారాం, కిరణ్‌కుమార్, మల్లికార్జునరావు, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందాల స్థావరంపై దాడి : ఐదుగురు అరెస్టు

సబ్బవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కోడి పందాల స్థావరంపై దాడిచేసి ఐదుగుర్ని అరెస్టు చేసినట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపిన వివరాలు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. మండలంలోని అప్పయ్యపాలెం శివార్లలో గల మామిడి తోటలో శనివారం కోడి పందాలు జరుగుతున్నట్టు తమకు ముందస్తు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు సిబ్బందితో వెళ్లి దాడి చేయగా, కొంత మంది తప్పించుకుని పరారయ్యారన్నారు. గాజువాకకు చెందిన కొండా పెంటయ్య, అగనంపూడికి చెందిన అట్టా చంద్రయ్య, వెదుళ్లనరవకు చెందిన మాటూరి సాయికుమార్, కూర్మన్నపాలేనికి చెందిన కె.సూర్యప్రకాశ్, పెదగంట్యాడకు చెందిన కె.గిరిబాబులను అరెస్టు చేసి అనకాపల్లి కోర్టుకు తరలించినట్టు చెప్పారు.

ఉత్తరాంధ్ర మాలల గర్జన పోస్టర్లు ఆవిష్కరణ


మాలల గర్జన పోస్టరను ఆవిష్కరిస్తున్న నేతలు

సబ్బవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విశాఖలోని గురుజాడ కళా క్షేత్రంలో వచ్చే నెల ఎనిమిదో తేదీన జరగనున్న ఉత్తరాంధ్ర మాలల గర్జన కార్యక్రమాన్ని అంతా విజయవంతం చేయాలని ఆలిండియా దళిత ఫోరం రాష్ట్ర కార్యదర్శి జి.జగ్జీవన్‌రావు, యు.వేణుగోపాలరావు కోరారు. శనివారం ఇక్కడి సాయినగర్‌లో ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. సోదరుల వలే ఉంటున్న మాల,మాదిగ విడగొట్టడం సరికాదన్నారు. రిజర్వేషన్ల ఫలాలు అందరూ అందుకోవాలని సూచించారు. కొంత మంది నేతలు స్వార్థం కోసం దళితుల మధ్య చిచ్చు రగిలించారని ఆరోపించారు. దళితులంతా ఐక్యతతో ఉండాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, నాయకులు మచ్చ కోటేశ్వరరావు, కైకాల సన్యాసిరావు, పాలిశెట్టి సురేష్‌రాజ్, పొట్ల కృష్ణ, ఎన్.కోటేశ్వరరావు, ఎం ..అప్పారావు, దొమ్మేని ఈశ్వరరావు, పట్నాల భీమారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహాసన్నిదాన పూజ


పూజలో పాల్గొన్న మేడిశెట్టి అప్పారావు, బండారు అప్పలనాయుడు తదితరులు

పరవాడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈ.బోనంగి ఫార్మా పునరావాస కాలనీ సమీపంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన అయ్యప్ప మహాసన్నిదాన పూజ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. స్వామి శరణు ఘోషతో పునరావాసకాలనీ దద్దరిల్లింది. ఈ.బోనంగికి చెందిన మాజీ ఉప సర్పంచ్ మేడిశెట్టి అప్పారావు 18వ సారి అయ్యప్పమాల ధరించిన సందర్భంగా ఈ పూజ చేపట్టారు. గురుస్వాములు రాజేశ్, నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడకకు పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు హాజరయ్యారు. అప్పారావుస్వామికి మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, గురుస్వాములు, కుటుంబ సభ్యులు కలిసి చక్రస్నానం చేయించారు. ఈ పూజా కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు, పలువురు కూటమి నాయకులు హాజరయ్యారు.

బీఆర్‌టీ కాలనీలో కాలువల నిర్మాణానికి శంకుస్థాపన

కొత్తూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం పిసినికాడ పంచాయతీ బీఆర్‌టీ కాలనీలో రూ.పది లక్షలతో కాలువల నిర్మాణానికి కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడ ఎప్పటి నుంచో కాలువల సమస్య ఉందన్నారు. ఈ అంశాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకు వెళ్లడంతో పరిష్కారానికి నోచుకున్నట్టు చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు మళ్ళ శ్రీనివాసరావు, పొలమరశెట్టి నూకరాజు, కాండ్రేగుల పరమేశ్వరరావు, పెద్దిశెట్టి దుర్గ, బుద్ద సోమేశ్వరరావు, కాండ్రేగుల నాగు, మద్దాల నాగ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం.. ఆమడ దూరం

» పరవాడలో అధ్వానంగా లుపిన్ పార్కు » పట్టించుకోని పంచాయతీ పాలకులు » కళా విహీనంగా మారడంతో స్థానికులు ఆగ్రహం



అధ్వానంగా దర్శనమిస్తున్న పార్కు ప్రాంగణం


పార్కులో తుప్పు పట్టిన పిల్లల ఆటల పరికరాలు

పరవాడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని దుర్గమాంబ ఆలయం వెనుక ఏర్పాటు చేసిన లుపిన్ పార్కు అధ్వానంగా దర్శనమిస్తోంది. పరవాడ పరిసర ప్రాంతాల ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు లుపిన్ ఫౌండేషన్ యాజమాన్యం సామాజిక బాధ్యతలో భాగంగా 2019లో సుమారు 70 సెంట్ల స్థలంలో దీనిని ఏర్పాటు చేసింది. వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆడుకునేందుకు వీలుగా ఆటల పరికరాలు, కూర్చొనేందుకు బెంచీలు, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులు, ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేశారు. తాగునీటి సౌకర్యానికి బోరు కూడా తవ్వించారు. నీటి సౌకర్యం పుష్కలంగా ఉండడంతో వివిధ రకాల మొక్కలను నాటి పచ్చదనాన్ని అభివృద్ధి చేశారు. కొంత కాలం తరువాత పార్కు నిర్వహణ బాధ్యతను పంచాయతీకి అప్పగించారు. కొన్నాళ్లపాటు నిర్వహణ బాగానే చేపట్టారు. ఆ తరువాత పట్టించుకోవడం మానేశారు. ఫలితంగా అధ్వానంగా మారింది. పార్కు ప్రాంగణమంతా ప్రస్తుతం పిచ్చి మొక్కలతో నిండిపోయింది. పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆటల పరికరాలతో పాటు ఇనుప బెంచీలు తుప్పు పట్టి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. కొన్ని ఎల్ఈడీ దీపాలు కనుమరుగుకాగా, కొన్ని దీపాల చుట్టూ తీగలు అల్లుకుపోయాయి. ప్లాస్టిక్ వ్యర్థాలతో పార్కు కళావిహీనంగా మారింది. నడక మార్గం అధ్వానంగా తయారైంది. రాత్రి సమయాల్లో మందుబాబులు పార్కును బార్‌లా వినియోగించుకుంటున్నారు. పంచాయతీ అధికారుల పర్యవేక్షణ కొరవడడం వల్లే ఈ పరిస్థితి ఎదురైందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన పార్కు నేడు అసాంఘిక కార్య కలాపాలకు అడ్డాగా మారిందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఇంత జరుగుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పార్కును తీర్చిదిద్ది, వినియోగంలోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని పరవాడవాసులు కోరుతున్నారు.


పార్కు ఆవరణలో పిచ్చిమొక్కలు

ఎక్కడ చూసినా పిచ్చి మొక్కలు, వ్యర్థాలే..



పార్కు ప్రాంగణం అధ్వానంగా తయారైంది. పిచ్చి మొక్కలతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. దుర్వాసన వెదజల్లుతోంది. పార్కులో కాసేపు సేద తీరుదామన్నా కూర్చొలేని పరిస్థితి నెలకొంది. బెంచీలు తప్పు పట్టేశాయి. వాకింగ్‌ట్రాక్ అధ్వానంగా మారింది. మందుబాబులకు అడ్డాగా మారింది.

\- లాలం రవీంద్ర, పరవాడ

అధికారులు పట్టించుకోవాలి



పార్కు అభివృద్ధికి పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలి. లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన పార్కును నిర్లక్ష్యంగా వదిలేయడం తగదు. పిల్లలు, పెద్దలు కాసేపు ప్రశాంతంగా గడపడం కోసం ఏర్పాటు చేసిన పార్కు నేడు అధ్వానంగా తయారవ్వడం చాలా బాధాకరం.

\- పైలా శ్రీనివాసరావు, పరవాడ

ఘనంగా గౌరీ పరమేశ్వరుల అనుపు ఉత్సవం


ఆళ్లవారి గౌరీపరమేశ్వరుల ఊరేగింపు

అనకాపల్లి టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లక్ష్మీదేవిపేట, గవరపాలెం సంతోషిమాత ఆలయం రోడ్డులోని ఆళ్లవారి గౌరీ పరమేశ్వరుల అనుపు మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. వేకువజామున ఆలయాల్లో గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌరమ్మకు కుంకుమార్చనలు జరిపారు. మధ్యాహ్నం అన్నసమారాధనలు నిర్వహించడంతో పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి ఆది దంపతులను దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. రాత్రికి ఉత్సవ మూర్తులను పురవీధులగుండా ఊరేగించారు. లక్ష్మీదేవిపేట గౌరీ పరమేశ్వరుల అనుపు మహోత్సవంలో భాగంగా పలువురు భక్తులు శూలాలను ధరించి మొక్కులు తీర్చుకున్నారు. ఇందులో భాగంగా కోలాటాలు, వెంకటేశ్వరస్వామి కీర్తనలు, డ్యాన్స్ బేబి డ్యాన్స్ వంటివాటిని ఏర్పాటు చేశారు. భారీఎత్తున బాణసంచాను కాల్చారు. ఇదిలావుంటే, పలుచోట్ల ఏర్పాటు చేసిన బాల గౌరమ్మలను ఊరేగించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ టీవీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


లక్ష్మీదేవిపేటలో గౌరీ పరమేశ్వరుల ఊరేగింపు

వాడవాడలా సత్యసాయిబాబా జయంత్యుత్సవం

» మందిరాల్లో భక్తుల పూజలు
» పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు


కొత్తూరు పంచాయతీ రామాపురంలో ప్రత్యేక అలంకరణలో బాబా


నిదానందొడ్డిలో బాబాకు రత్నాకర్ పూజలు


బాబాను దర్శించుకుని బయటకు వస్తున్న బుద్ద నాగజగదీశ్ తదితరులు

అనకాపల్లి టౌన్, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి) : సత్యసాయిబాబా జయంతిని శనివారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. అనకాపల్లిలో ఈ వేడుకలు మరింత భక్తిశ్రద్ధలతో చేపట్టారు. నిదానందొడ్డిలోని పరమేశ్వరిపార్కు జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న సత్యసాయి మందిరాల్లో బాబాకు ప్రత్యేక పూజలు జరిపారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, వైసీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్‌తో పాటు పలువురు టీడీపీ నాయకులు దర్శించుకున్నారు. నిదానందొడ్డిలోని బాబా ఆలయం వద్ద దాడి రత్నాకర్ పూజలు నిర్వహించిన అనంతరం పార్కు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ప్రారంభించారు. ఇదిలావుంటే, ఎన్టీఆర్ వైద్యాలయంలోని సత్యసాయి అన్నదాన భవనంలో కూడా బాబా జయంతి నిర్వహించారు. అలాగే, కొత్తూరు పంచాయతీ రామాపురంలో ఉన్న భగవాన్ సత్యసాయి మందిరంలో బాబా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. సత్యదేవ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటైంది. మధ్యాహ్నం మందిరం వద్ద భారీగా అన్నసమారాధన జరిపారు. మందిరం ప్రతినిధులు వీవీ రమణ, టీవీపీ మహేశ్వరి, జగన్నాథం, సుమతి కిరణ్, హిందూ శ్రీనివాసరావు, రమణ, సుబ్రహ్మణ్యం, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌వో కేంద్రాలను సందర్శించిన తహసీల్దార్


చెరకాంలో ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

కశింకోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్ళపాలెం, గురుగు భీమవరం, చెరకాం తదితర గ్రామాల్లో ఉన్న బూత్ లెవెల్ కార్యాలయాలను తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఫారం -6, 7, 8 ఎన్ని వచ్చాయి అనే అంశాలపై ఆరా తీశారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. మృతి చెందినవారు, వలస వెళ్లేవారిని గుర్తించి ఆయా వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా ఓటరు కార్డుల్లో తప్పుగా నమోదైన పేర్ల మార్పు, అడ్రసు వివరాల్లో మార్పులు ఉంటే బీఎల్‌వోలు మార్పు చేయాలని ఆదేశించారు.

శివారు గ్రామాల్లో మౌలిక వసతులు కల్పన

» 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

పరవాడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు పరిధిలోని శివారు గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు మంజూరు చేయిస్తానని వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ స్పష్టం చేశారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి శనివారం ఆయన దేశపాత్రునిపాలెం, జాజులవానిపాలెం, శ్రీనివాస్‌నగర్, సాయినగర్‌కాలనీ, ఎస్సీ కాలనీ, అశోక్‌నగర్‌లలో పర్యటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలువలు, వీధి రోడ్ల నిర్మాణం చేపట్టాలని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వీటి నిర్మాణం కోసం అధికారులతో ప్రతిపాదనలు సిద్ధం చేయించినట్టు చెప్పారు. వీటిని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, జీవీఎంసీ మునిసిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి నిధులు తొందరగా మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. నిధులు విడుదలైన వెంటనే పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాజుల చిన్నారావు, కర్రి అప్పారావు, ప్రకాశ్, వర్కు ఇన్‌స్పెక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.


ఇళ్ల మధ్య నిల్వ ఉన్న మురుగును పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్

అటల్ మారథాన్‌లో 'గురుకులం' ప్రతిభ


పోటీల్లో ప్రతిభ చూపినవారిని అభినందిస్తున్న రూపవతి

సబ్బవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అనంతపురం జిల్లా శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో ఈనెల 18 నుంచి 22 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి అటల్ టింకరింగ్ మారథాన్ పోటీల్లో ఇక్కడి అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో ఏర్పాటైన అభినందన కార్యక్రమంలో గురుకుల విద్యాలయాల సమన్వయాధికారిణి ఎస్.రూపావతి మాట్లాడారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లా నుంచి సబ్బవరం విద్యార్థులు జె.సందీప్, జి.గుణశేఖర్, ఎం.అశోక్ హాజరయ్యారన్నారు. నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో డిజైన్ ది యంగ్ మార్కెటింగ్ ఐడీఆర్ స్కిల్స్, ప్రొడక్ట్ డిజైన్ స్కిల్స్‌లో ప్రతిభను చూపారని వివరించారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టును శ్రీకృష్ణదేవరాయ వర్సిటీకి అప్పగించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ వైస్ ప్రిన్సిపాల్ సత్యారావు, గైడ్ టీచర్ రాంబాబు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దేశవ్యాప్త ఆందోళనపై ఫార్మాసిటీలో ప్రచారం

పరవాడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్మికులు, రైతుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న చేపట్టనున్న దేశవ్యాప్త ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం ఫార్మాసిటీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రైతు, కార్మికుల సమస్యలు పట్టనట్టు వ్యవహరిస్తోందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో మంగళవారం అనకాపల్లిలోని నెహ్రూచౌక్ వద్ద మహాధర్నాను నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్మికులు, రైతులు పెద్ద సంఖ్యలో తరలి రావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, నాయకులు గుమ్మాల శివచలం, బి.నాగరాజు, పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'భరణికాన'కు టీడీపీ నేతలు పరామర్శ


బాబూరావును ఓదారుస్తున్న పల్లా శ్రీనివాసరావు

సబ్బవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సీనియర్ నాయకుడు, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు భరణికాన బాబూరావు కుటుంబ సభ్యలను శనివారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పెందుర్తి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి, ఏపీ ఆయిల్ ఫెడ్ చైర్‌పర్సన్ గండి బాబ్జీ పరామర్శించారు. బాబూరావు కుమారుడు రాజేశ్ ఈనెల 21న గురువారం గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న వారు శోక సంద్రంలో ఉన్న బాబూరావుతో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. వారి వెంట మాజీ ఎంపీపీ గండి దేముడు, పల్ల తాతారావు తదితరులు ఉన్నారు.

గ్రామాల పరిశుభ్రత అందరి బాధ్యత

» సబ్బవరం, కశింకోట ఎంపీడీవోలు పద్మజ, రవికుమార్


సబ్బవరం : గుల్లేపల్లిలో రోడ్డును శుభ్రం చేస్తున్న ఎంపీడీవో పద్మజ


కశింకోట : తాళ్లపాలెంలో చెత్తను ఊడ్చుతున్న ఎంపీడీవో రవికుమార్

సబ్బవరం, నవంబరు23 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో పి.పద్మజ పిలుపునిచ్చారు. మండలంలోని గుల్లేపల్లిలో శనివారం నిర్వహించిన స్వచ్ఛతే సేవ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో కలిసి చీపురు చేతబట్టి పలు వీధుల్లో చెత్తాచెదారాన్ని తొలగించారు. అంతకు ముందు మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి వారం ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేసినట్టు చెప్పారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండారు మంగ, గ్రామ పెద్దలు బోకం రామునాయుడు, బండారు శ్రీనివాసరావు, పంచాయితీ సిబ్బంది ఆరోగ్య సిబ్బందితో పాటు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

కశింకోట : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో వి.వి.రవికుమార్ సూచించారు. మండలంలోని తాళ్ళపాలెం, కశింకోట గ్రామాల్లో నిర్వహించిన స్వచ్ఛతే సేవ కార్యక్రమానికి ఆయాన హాజరయ్యారు. చీపురు చేతపట్టి రోడ్లపై చెత్తను ఊడ్చారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లించారు. అంతకుముందు పరిశుభ్రత పాటించడం వల్ల ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం ఆత్మీయ సమ్మేళనం



వన భోజనాలు చేస్తున్న దృశ్యం

సీలేరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జీకే వీధి మండలం సీలేరులో శనివారం స్థానిక గుంటవాడ జలాశయం వద్ద గల జామ తోటల్లో పద్మశాలి సంఘం ఆత్మ సమ్మేళనం జరిగింది. సీలేరు గ్రామంలోని 40 కుటుంబాల సభ్యులు హాజరై సందడి చేశారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం సంఘ సభ్యులంతా కలసి వన భోజనాలు చేశారు.సాయంత్రం వరకు ఆట పాటలతో గడిపారు.

డిగ్రీ కళాశాలలో క్యాంటీన్ ఏర్పాటుకు దరఖాస్తులు

చింతపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు ఆసక్తి గల వ్యాపారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి తెలిపారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కళాశాల ఆవరణలో క్యాంటీన్ ఏర్పాటుకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిరుద్యోగ గిరిజన యువతకు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందని, ఆసక్తి గల వ్యాపారులు ప్రిన్సిపాల్ కార్యాలయాన్ని సంప్రతించాలన్నారు.

జూ.కళాశాలలో స్వచ్ఛభారత్



చెత్తను తొలగిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

సీలేరు, నవంబరు 23 , (ఆంధ్రజ్యోతి) : జీకే వీధి మండలం సీలేరులో ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. విద్యార్థులు కళాశాల ఆవరణలో శుభ్రం చేశారు. అక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వి.శంకరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ శ్రీను ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరిపై బైండోవర్ కేసు

గూడెం కొత్తవీధి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో భూవివాదరంపై ఇద్దరు వ్యక్తులపై బైండోవర్ కేసు నమోదు చేసినట్టు స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ తెలిపారు. శనివారం భూవివాదంపై తరచూ తగాదాలుపడుతున్న ఇద్దరు వ్యక్తులపై తహసీల్దార్ విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ముక్కలి వాసుదేవరావు, సురకత్తి కనకమహాలక్ష్మి భూమి విషయమై తరచూ తగాదాలు పడుతున్నారన్నారు. దీంతో ఇరువురూ తగాదాలు పడకుండ ఉండేందుకు బైండోవర్ కేసు పెట్టామన్నారు. భూవివాదాన్ని మ్యుటేషన్ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించినట్టు తెలిపారు

విద్యార్థులకు మెరుగైన బోధన

అరకులోయ,నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అరకులోయకు సమీపంలో ఉన్న రవ్వలగుడ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆ శాఖ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ ఎల్.రజని శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థుల స్టడీ అవర్‌ను పరిశీలించారు. స్టడీ అవర్‌లో ఉపాధ్యాయులు విద్యార్థులకు అందుబాటులో ఉండాలన్నారు. మెరుగైన బోధన అందించాలని చెప్పారు. అనంతరం విద్యార్థుల మెనూపై ఆరా తీశారు.

జోరుగా టీడీపీ సభ్యత్వాల నమోదు

డుంబ్రిగుడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలో టీడీపీ సభ్యత్వాల నమోదు జోరుగా సాగుతోంది. శనివారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు సుబ్బారావు ఆధ్వర్యంలో కించుమండ పంచాయతీలో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు శివ బాలకృష్ణ, నర్సయ్య, చంటి పాల్గొన్నారు.

సచివాలయంలో నవరత్నాల లోగో!

గూడెంకొత్తవీధి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంకాడ సచివాలయంలో నవరత్నాల లోగో తొలగించకపోవడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయం భవనంపై వైసీపీ ప్రభుత్వ హయాంలో నవరత్నాల లోగో ఏర్పాటు చేశారు. ప్రభుత్వం మారినా ఉద్యోగులు లోగో తొలగించలేదు సరికదా కనీసం దానిపై గుడ్డ కూడా వేయలేదు.ఈవిషయమై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటోలు కూడా ఏర్పాటు చేయలేదని కూటమి నాయకులు నాగేంద్ర, గోవింద్, ఈశ్వర్, బాబూరావు, సంజీవ్ తెలిపారు. అధికారులు స్పందించి నవరత్నాల లోగోను తొలగించాలని వారు కోరారు.

అదానీతో ఒప్పందాన్ని రద్దు చేయాలి

» సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న సీపీఎం నేతలు

పాడేరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ కొనుగోలుకు సంబంధించి గత వైసీపీ ప్రభుత్వం ప్రముఖ వ్యాపారవేత్త అదానీతో కుదుర్చుకున్న చీకటి ఒప్పందాన్ని రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. అదానికి వ్యతిరేకంగా స్థానిక ఐటీడీఏ కార్యాలయం ముందు శనివారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈసీఐ)తో విద్యుత్ కొనుగోలుకు సంబంధించి అక్రమాలు జరిగాయంటూ అమెరికా న్యాయం స్థానంలో కేసు నేపథ్యంలో సిటింగ్ జడ్జితో విచారణకు డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో నిందితులు అరెస్టు, ముడుపులు అందుకున్న వారి వివరాలను పొందేందుకు అమెరికాతో కేంద్ర ప్రభుత్వం చర్యలు జరపాలన్నారు. రాష్ట్రంలో 2019-24 మధ్యలో అధికారంలో ఉన్న వాళ్లకు రూ.2,029 కోట్లు ముడుపులు అందినట్లుగా అమెరికాలోని తూర్పు న్యూయార్క్ కోర్టులో కేసు నమోదైందన్నారు. అదానీ రాష్ట్రంలోని పోర్టులు, పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి అక్రమంగా అనుమతులు పొందారని ఆరోపించారు. అదానీ గ్రూప్ అక్రమాలకు పాల్పడుతోందని గతంలోనే అనేకమంది పాలకులను హెచ్చరించినప్పటికీ పట్టించుకోకపోవడం ఘోరమన్నారు. ఈ వ్యవహారంతో సంబంధమున్న వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

అదానీ దిష్టిబొమ్మ దహనానికి యత్నం

నిరసనలో భాగంగా అదానీ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు సీపీఎం నేతలు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. శాంతియుతంగా నిరసన తెలపాలని, దిష్టిబొమ్మలు దహనం వంటి వాటికి అనుమతిలేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు ధర్మన్న పడాల్, జీవన్, కార్తిక్, చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వలంటీర్ల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గ్రామ వలంటీర్లు

పాడేరు రూరల్, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వ ర్యంలో గ్రామ, వార్డు వలంటీర్లు శనివారం ఐటీడీఏ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్. సుందరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వలంటీర్లను విధుల్లోకి తీసుకొని రూ.10 వేలు వేతనం ఇస్తామన్న చంద్రబాబు ఎన్నికల హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు.అలాగే బకాయి ఉన్న రెండు నెలల వేతనాలు చెల్లించాలని, జాబ్‌కార్డు విడుదల చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజీనామాలు చేసిన వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2023, ఆగస్టు తరువాత వలంటీర్లను రెన్యువల్ చేయకుంటే 2024, మే నెల వరకు వేతనాలు కూటమి ప్రభుత్వం ఎలా చెల్లించిందని ప్రశ్నించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్. ధర్మన్న పడాల్, సీఐటీయూ ఉపాధ్యక్షులు బి.సన్నిబాబు, వలంటీర్ల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ప్రసాదరావు, బి.కొండబాబు, సంఘం నాయకులు జి. దేవా, టి.శోభన్, చిన్నయ్య, సురేష్‌కుమార్, సత్యారావు, తాతబాబు, కృష్ణారావు, ఆనంద్, కొండమ్మ, భవానీ పాల్గొన్నారు.

పాలిథిన్ నిషేధంపై అవగాహన



సర్పంచ్, ఎంపీటీసీ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సీలేరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జీకే వీధి మండలం సప్పర్ల వారపు సంతలో శనివారం ప్లాస్టిక్ నిషేధంపై గాలికొండ ఎంపీటీసీ, సర్పంచ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. డిసెంబరు ఒకటి నుంచి ప్లాస్టిక్ నిషేధిస్తున్నందున ఇకపై షాపులు, చిన్న చిన్న దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్లు వినియోగించినా, అమ్మినా చర్యలు తీసుకుంటామని అవగాహన కల్పించారు. అనంతరం దుకాణదారులకు నోటీసులు అందించారు.

అవుట్ సోర్సింగ్ బోధన సిబ్బందిని క్రమబద్ధీకరించాలి : ఎమ్మెల్సీ రఘువర్మ



గురుకుల అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరాహార దీక్షలకు సంఘీభావం తెలిపిన ఎమ్మెల్సీ రఘువర్మ, ఏపీటీఎఫ్ నాయకులు

పాడేరు రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఏపీ గిరిజన గురుకులాల్లో విధులు నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయ, అధ్యాపకులపై రాష్ట్ర ప్రభుత్వానికి వివక్ష తగదని, తక్షణమే వారిని కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి మినిమం టైం స్కేల్ అమలు చేయాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ కోరారు. శనివారం పాడేరు వచ్చిన ఆయన ఐటీడీఏ ఎదురుగా 8 రోజులుగా ధర్నా చేస్తున్న గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల శిబిరాన్ని ఏపీటీఎఫ్ జిల్లా నాయకులతో కలిసి సందర్శించారు. శిబిరంలో వారితో పాటు కూర్చొని నిరహార దీక్షలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గురుకుల ఉపాధ్యాయ, అధ్యాపకులకు పనికి తగిన వేతనం ఇవ్వకుండా చాలీచాలని వేతనాలు చెల్లిస్తూ ప్రభుత్వాలు బానిసలుగా చూడటం తగదన్నారు. 2022 పీఆర్సీ ప్రకారం కనీస వేతనం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.జగన్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి కొర్రా ధనుంజయ్, జిల్లా నాయకులు అంబిడి శ్యామసుందర్, బి.చిన్నారావు, ఎస్.శాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దండకారణ్య ఉద్యోగ సమితి సంఘీభావం

సమస్యల పరిష్కారం కోరుతూ ఐటీడీఏ ఎదురుగా ఎనిమిది రోజులుగా ధర్నా చేస్తున్న గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు దండకారణ్య ఉద్యోగ సమితి సంఘీభావం తెలిపింది.. సమితి కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్.మాణిక్యం శనివారం శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోడా ఆనందరావు, ముఖ్యకార్యదర్శి ధనుంజయ్, కార్యదర్శి రాజుబాబు, సమన్వయ కర్తలు మోహిని, ఆనందకుమారి, ప్రభాకర్, దండకారణ్య వియోచన సమితి నాయకులు కె. కాసులమ్మ, వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

విరాళాలతో సరిహద్దు వంతెనకు మరమ్మతులు



ఇనుప వంతెన మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ముంచంగిపుట్టు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జోలాపుట్టు సమీపంలో ఆంధ్రా ఒడిశా సరిహద్దు ఇనుప వంతెన మరమ్మతులు శనివారం చేపట్టారు. స్థానికులు విరాళాలు వేసుకుని ఈ పని చేయించారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు జోలాపుట్టు జలాశయం గేట్లు ఎత్తివేయడంతో నీటి ఉధృతికి ఇనుప వంతెన దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఇరు రాష్ట్రాల మధ్య రాకపోకలు స్తంభించిపోవడంతో స్థానికులు, ప్రజా ప్రతినిధులు విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆంధ్రా అధికారులు వంతెన ముందు భాగంలో కొట్టుకుపోయిన మట్టి స్థానంలో మట్టి వేసి, ఇరువైపులా రాతి పేర్పు చేపట్టారు. అయితే వంతెనపై పలుచోట్ల రంధ్రాలు పడడంతో పాటు పైకప్పు రేకులు పైకి తేలిపోయి ఉన్నా.. మరమ్మతులు చేయలేదు. దీంతో ద్విచక్ర వాహనదారులు భయాందోళన మధ్య రాకపోకలు సాగిస్తున్నారు. ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో స్థానికులు చందాలు వేసుకొని, వచ్చిన డబ్బులతో వంతెనకు తాత్కాలిక మరమ్మతులు జరిపారు. కప్పు రేకులను సరిచేయడంతో పాటు రంధ్రాలను వెల్డింగ్ చేయించి మూసివేయించారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి నూతన వంతెన నిర్మాణానికి కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు



నాలుగు రోడ్ల కూడలి నుంచి సుజనకోటకు వెళ్లే మార్గంలో ట్రాఫిక్

ముంచంగిపుట్టు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో శనివారం జరిగే వారపు సంత నాడు నాలుగు రోడ్ల కూడలి వద్ద తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. దీంతో సంతకు వచ్చేవారు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు రోడ్ల కూడలి నుంచి సుజనకోట వెళ్లే ప్రధాన రహదారి వైపు వారపు సంత రోజు వాహనాలను అడ్డదిడ్డంగా నిలిపివేస్తున్నారు. గంటల తరబడి నిలిపివేయడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. అటువైపు వాహనాలు రాకపోకలు సాగించాలన్నా, పాదచారులు వెళ్లాలన్నా కష్టంగా మారుతుంది. పలు సందర్భాల్లో అత్యవసర వాహనం సైతం ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన సంఘటనలు ఉన్నాయి. పోలీసులు సాధారణ రోజుల్లో హడావిడి చేస్తున్నారు తప్ప వారపు సంత రోజు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. సాధారణ రోజుల కంటే వారపు సంత రోజు మైదాన ప్రాంతం నుంచి, ఒడిశా నుంచి అధిక సంఖ్యలో వాహనాలు వస్తుంటాయి. వాటి వల్ల ట్రాఫిక్ సమస్య ఎక్కువగా నెలకొంటోంది. ఇప్పటికైనా పోలీసులు స్పందించి వారపు సంత రోజు ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



రమేశ్‌నాయుడును సన్మానిస్తున్న కూటమి నాయకులు

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి

గూడెంకొత్తవీధి,నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) :మండలంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని ఏపీ టూరిజం శాఖ సభ్యుడు కిల్లు రమేశ్ నాయుడు అన్నారు. శనివారం ఆయన జీకేవీధి రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూటమి నాయకులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రమేశ్‌నాయుడు మాట్లాడుతూ మండలంలోని దోనుగుమ్మల జలపాతం, ధారాలమ్మ అలయం, సీలేరు, రెయిన్ గేస్ ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు రీమల రాజేశ్వరి, బీజేపీ మండల అధ్యక్షుడు వానపాల జోగిరాజు, నాయకులు లకే రాము, రీమల పాల్, జనసేన నాయకుడు సిద్దార్థ్, టీడీపీ నాయకులు బలరామ్, మహేశ్, దేవరాపల్లి సర్పంచ్ బుజ్జిబాబు పాల్గొన్నారు.

బాలరేవులో పీహెచ్‌సీ ఏర్పాటుకు వినతి

కొయ్యూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బాలరేవు పంచాయతీ కేంద్రంగా 20 పడకల ఆస్పత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్టు సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, వార్డు సభ్యుడు సంజీవ్ తెలిపారు. శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. పంచాయతీ పరిధిలో దొడవగొయ్యి, బొడ్డుమామిడి, కొర్రపాడు, సల్దిగెడ్డ తదితర 11 గ్రామాలకు అటవీశాఖ అభ్యంతరాలతో నిలిచిన రహదారి పనులు పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరినట్టు తెలిపారు. కలెక్టరు సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారని వారు చెప్పారు.



పోటీలను ప్రారంభిస్తున్న గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్‌పర్సన్ కల్పనాకుమారి

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

సాగర్‌నగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జన జాతీయ గౌరవ దివస్ వేడుకల్లో భాగంగా రుషికొండ గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ, పిజి, ఇంజనీరింగ్ కళాశాలల క్రీడా ఆవరణలో శనివారం నుంచి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ పోటీలను గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్‌పర్సన్ కల్పనాకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసం కలిగిస్తాయన్నారు. టీసీఆర్ టీఎం ఆధ్వ ర్యంలో ఈ పోటీలు నిర్వహించడం గర్వించతగ్గ విషయమని చెప్పారు. అనంతరం ఆర్చరీ, జావెలిన్ త్రో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 8 ఐటీడీఏ లకు చెందిన 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కాగా అంతకముందు ఆమె రుషికొండలో ఏర్పాటు చేసిన గిరిజన సంతను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీసీఆర్ అండ్ టీఎం ఈడీ డాక్టర్ రాణిమందా, తదితరులు పాల్గొన్నారు.

దుప్పులవాడలో వైద్య సిబ్బంది పర్యటన



కాట్రగెడ్డ గ్రామంలో గిరిజనులకు వైద్య సేవలను అందిస్తున్న వైద్యాధికారి ఎస్‌కె మస్తాన్‌వల్లీ

సీలేరు, నవంబరు 23, (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీలో శనివారం సీలేరు పీహెచ్‌సీ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారి ఎస్‌కె మస్తాన్‌వల్లీ ఆధ్వర్యంలో జొన్నమామిడి, పిల్లిగెడ్డ, కాట్రగెడ్డ, ఎస్. నేరేడుపల్లి గ్రామాలకు తమ వైద్య సిబ్బందితో తరలి వెళ్లి అక్కడ గిరిజనులకు వైద్య సేవలు అందించారు.గిరిజనులు వ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అలాగే గ్రామాల్లో గర్భిణులు ఉంటే ప్రతి నెలా 9న పీహెచ్‌సీకి వచ్చి పరీక్షలను చేయించుకోవాలని, నెలలు నిండితే ఆశా కార్యకర్తల సహకారంతో ముందుగానే ఆస్పత్రిలో చేరాలన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎస్ ఎం.త్రినాథరావు, వైద్య సిబ్బంది సత్యనారాయణ, కుమారి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల ముసాయిదా సిద్ధం



ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

గూడెంకొత్తవీధి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు జాబితా సిద్ధం చేసినట్టు స్థానిక తహసీల్ధార్ టి.రామకృష్ణ తెలిపారు. శనివారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు జాబితాను రెవెన్యూ కార్యాలయంలో ప్రదర్శించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో ఓటు హక్కు కోసం 135 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లతో కూడిన జాబితాను ప్రకటించామన్నారు. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను వచ్చే నెల 9 వరకు తహసీల్దార్ కార్యాలయంలో స్వీకరించనున్నట్టు తెలిపారు.

మహారాష్ట్రలో బీజేపీ విజయంపై సంబరాలు



అంబేడ్కర్ కూడలిలో సంబరాలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

పాడేరురూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలో బీజేపీ కూటమి 230 సీట్లు కైవసం చేసుకోవడంతో అల్లూరి జిల్లా బీజేపీ శ్రేణులు శనివారం పాడేరులో ఘనంగా సంబరాలు నిర్వహించారు. అంబేడ్కర్ కూడలిలో భారీ బాణసంచా పేల్చి పాదచారులు, పార్టీ అభిమానులకు స్వీట్‌లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు మాట్లాడుతూ మహారాష్ట్రలో కూటమి గెలుపు ఆనందకరమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనపై ప్రజలకు ఉన్న విశ్వాసం మరోసారి రుజువైందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సల్లా రామకృష్ణ, కె.వెంకటరమణ, పాపిటి రాజు, కె.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

కీళ్లనొప్పుల రోగులకు అందుబాటులోకి వైద్యం

» మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.ప్రభావతి



ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా చికిత్స చేసిన రోగితో ఏరియా ఆస్పత్రి వైద్యులు

చింతపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఏరియా ఆస్పత్రిలో కీళ్ల నొప్పులతో బాధపడుతున్న రోగులకు ఆధునిక చికిత్స అందిస్తున్నట్టు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.ప్రభావతి అన్నారు. శనివారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో మోకాలు ఆరుగుదల వల్ల నొప్పులతో బాధపడుతున్న గిరిజన మహిళలు అర్థోపెడిక్ వైద్యాధికారి ఇ.సాయికృష్ణ ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా చికిత్స నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో తొలిసారిగా స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ వైద్యాధికారి ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా చికిత్స నిర్వహించినట్టు చెప్పారు. ఈచికిత్స పొందాలంటే ప్రైవేటు ఆస్పత్రిలో రూ.40 నుంచి రూ.50 వేలు ఖర్చు అవుతుందన్నారు. ఈ చికిత్స వల్ల కీళ్లనొప్పులు తగ్గుతాయన్నారు. గిరిజన ప్రాంతంలో కీళ్లనొప్పులతో బాధపడుతున్న రోగులు ఏరియా ఆస్పత్రికి వచ్చి మెరుగైన చికిత్స పొందవచ్చని సూచించారు. ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా చికిత్స చేసిన ఆర్థోపెడిక్ వైద్యులను అభినందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రమేశ్ పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ చలపతిరావు, అధ్యాపకులు

అరకులోయ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అరకులోయ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు అన్నారు. శనివారం ఆ కళాశాల నూతన భవనం ఆవరణలో అధ్యాపకులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటిన మొక్కలను సంరక్షించుకుంటే పదికాలాల పాటు కళాశాల ఆవరణలో నీడనివ్వడంతో పాటు ప్రాణ వాయువు పుష్కలంగా అందుతుందన్నారు. విద్యార్థులు కూడా ఇళ్ల వద్ద మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీపీడీసీ సభ్యులు మయూరి రాజారావు, రామరాజు, అరకులోయ క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి, దండకారణ్య ప్రిన్సిపాల్ శ్రీనుబాబు, అధ్యాపకులు ధర్మారావు, బలరాం, లక్ష్మీ, స్వర్ణలత, పీవీవీ ప్రసాద్, దివ్య మౌనిక, అన్నపూర్ణ, ప్రణీత, తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో గంజాయి నిర్మూలన



సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో సమావేశమైన ఎస్ఐ నాయుడు

డుంబ్రిగుడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గిరిజన గ్రామాలను గంజాయి రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎస్ఐ పికె నాయుడు కోరారు. ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయితో జీవితాలు నాశనం అవుతున్నాయని చెప్పారు. అమాయక గిరిజనులను ఆసరాగా చేసుకుని కొందరు వ్యక్తులు గంజాయి సాగు, రవాణా చేస్తూ ఆస్తులు కూడబెట్టుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామాలను గంజాయి రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. అలాగే యువత ఉన్నత చదువులకు తోడ్పాటు అందించి, వారిని ప్రోత్సాహించాలని చెప్పారు.



రూ.50 లక్షలతో అటవీ కార్యాలయ భవనాలు

›› నర్సీపట్నం సబ్ డీఎఫ్‌వో సునీల్‌కుమార్

కృష్ణాదేవిపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ కార్యాలయాలకు నూతన భవనాల కోసం రూ.50 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదన పంపామని నర్సీపట్నం సబ్ డీఎఫ్‌వో సునీల్‌కుమార్ తెలిపారు. గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేట అటవీ కార్యాలయాన్ని శనివారం సాయంత్రం సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం కార్యాలయంలో నూతనంగా వివిధ జాతుల నర్సరీ ఏర్పాటు చేయనున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ పాలకులు నిర్మించిన భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటి స్థానంలో కొత్త భవనాలు నిర్మించి రక్షణ కంచె ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్టు చెప్పారు. కృష్ణాదేవిపేట అటవీ రేంజ్ పరిధిలో 70 వేలు బ్యాగ్ మొక్కలతో పాటు వంద బెడ్ టేకు, ఇతర అటవీ జాతుల నర్సరీ ఏర్పాటు కోసం జిల్లా కలెక్టర్‌కు నివేదించామని చెప్పారు. ఈ మేరకు గొలుగొండ, కృష్ణాదేవిపేట అటవీ కార్యాలయాల వద్ద 40 వేల బ్యాగ్ మొక్కలతో పాటు ప్రైవేటు ప్రాంతాల్లో మరో 30 వేలు మొక్కలు వేసి రైతులకు, అడవులు అభివృద్ధి కృషి చేస్తున్నామని చెప్పారు. రైతులకు అవసరమైన సరుగుడు, జామ, నేరడితో పాటు అటవీ ప్రాంతంలో టేకు, నల్లమద్ది, రోజ్‌వుడ్ తదితర జాతుల మొక్కలు వేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారి కె.శ్రీనివాసరావు, డిప్యూటీ రేంజ్ అధికారి వి.సత్యనారాయణ, గార్డులు పాల్గొన్నారు.


కృష్ణాదేవిపేటలో నర్సరీ వేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సబ్ డీఎఫ్‌వో

బాబా సేవా మార్గం ప్రపంచానికే మార్గదర్శకం

›› మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

కె.కోటపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా ఆధ్యాత్మిక, సేవా మార్గం ప్రపంచానికే మార్గదర్శకమని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. కూండ్రపువానిపాలెం గ్రామంలో శనివారం బాబా జయంతిని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కొప్పల వెలమ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్ ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యసాయి బోధించిన ప్రేమ, సేవ, శాంతి, సత్యం, ధర్మం వంటి ఆధ్యాత్మిక సూత్రాలు అందరికీ ఆదర్శనీయమన్నారు. అనంతరం వంద మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. మధ్యాహ్నం జరిగిన అన్నసమారాధనలో పలు గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలను స్వీకరించారు. అలాగే చిన్నారుల ఆధ్యాత్మిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కన్వీనర్ కన్నూరు చెల్లుబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్.మహేష్, సత్య సేవా సంస్థల ప్రతినిధులు కశిరెడ్డి అప్పలనాయుడు, కె.అప్పలనాయుడు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కె.సూర్యనారాయణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి, సర్పంచ్ బండారు ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.


దుప్పట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

నేడు రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలు

దేవరాపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడిపల్లి గ్రామంలో ఈరుడుమాంబ అమ్మవారి మాస మహోత్సవం సందర్భంగా ఆదివారం రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. పాలపుంత వద్ద జరగనున్న ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.20 వేల నగదుతో పాటు షీల్డు అందిస్తామన్నారు. అలాగే తరువాత స్థానాల్లో నిలిచిన ఎడ్ల యజమానులకు వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు నగదు బహుమతులు అందిస్తామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాలను విజయవంతం చేయాని వారు కోరారు.

27న నుంచి మొబైల్ ఆధార్ శిబిరాలు

చీడికాడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 27 నుంచి మొబైల్ ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తామని ఎంపీడీవో హేమసుంద్రరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 27న కోనాం గురుకుల బాలికల పాఠశాలలో శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే 28, 29 తేదీల్లో వరహాపురం, దిబ్బపాలెం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కార్యక్రమం ఉంటుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకునేలా చూడాలని కోరారు. ఎంఈవో రమణ పాల్గొన్నారు.





ఉత్సాహంగా ఏబీఎం విద్యా సంస్థల ఫ్రెషర్స్ డే

నర్సీపట్నం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏబీఎం కళాశాలలో ఫ్రెషరల్స్ డే, ఫేర్‌వెల్ డే వేడుకలను ఉత్సహంగా నిర్వహించారు. పెదబొడ్డేపల్లి ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఏబీఎం విద్యా సంస్థల కరస్పాండెంట్ అకంరెడ్డి గిరిబాబు అధ్యక్షతన శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ కుమార్‌బాబు జ్యోతి ప్రజ్వనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థినుల నృత్య ప్రదర్శన

సబ్ జైలును సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి

నర్సీపట్నం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి పి.సియాజ్‌ఖాన్ శనివారం సబ్ జైలును సందర్శించారు. ఖైదీలకు అందుతున్న భోజన, వసతి సదుపాయాలు, ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. న్యాయవాదులను పెట్టుకునే ఆర్థిక స్థోమత లేకపోతే మండల లీగల్ సర్వీసెస్ ద్వారా ఉచిత సహాయం పొందవచ్చన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం పక్కన న్యాయాధికారుల నివాస భవనాన్ని పరిశీలించారు. అనుమతులు లేకుండా ఈ ప్రాంతంలో ప్రైవేటు వ్యక్తులు సంచరిస్తే కఠిన చర్యలు చేపట్టాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

పెండింగ్ కేసులు లేకుండా చర్యలు చేపట్టాలి

గొలుగొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులు లేకుండా చర్యలు చేపట్టాలని డీఎస్పీ మోహన్ ఆదేశించారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను శనివారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పెండింగ్ కేసుల్లో నిందితులను పట్టుకుని కోర్టుకు తరలించాలని సిబ్బందికి సూచించామన్నారు. రికార్డులు లేని వాహనాలు, ట్రిబుల్ డ్రైవింగ్, మద్యం సేవించి, స్పీడ్ డ్రైవింగ్ చేసిన వాహనదారులపై కేసులు నమోదు చేయాలని ఎస్‌ఐ రామారావును డీఎస్పీ ఆదేశించారు.


రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

భక్తిశ్రద్ధలతో సత్యసాయి జయంతి

నర్సీపట్నం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా 99వ జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శారదానగర్ సత్యసాయి మందిరంలో శనివారం వంద మంది భక్తులతో మహా నగర సంకీర్తన, 150 మందితో సామూహిక సత్యసాయి వ్రతాలు చేశారు. ఏరియా ఆస్పత్రిలో రోగులకు, సబ్ జైల్ రిమాండ్ ఖైదీలకు రొట్టెలు, పండ్లు పంపిణీ, పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం వేద పఠనం, ఉయ్యాల సేవలతో ఉత్సవాలు ముగించారు. సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు సాయిరాం, రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

ఏఎల్‌పురంలో దుప్పట్ల పంపిణీ

కృష్ణాదేవిపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏఎల్‌పురం గ్రామంలో శనివారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిరుపేదలు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం రామాలయాల వద్ద అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్, సర్పంచ్ వై.నూకరత్నం, టీడీపీ నేత వరహాలబాబు, సత్యసాయి ట్రస్టు సభ్యులు పల్లి సత్యనారాయణ, రాజశేఖర్, వాసు, రమణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలు

చీడికాడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఖండివరం జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు టీటీడీ నుంచి వచ్చిన భగవద్గీత పుస్తకాలను శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో దుర్గాదేవి ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బి.కృష్ణ, జె.శ్రీనివాస్, పి.నారాయణదొర, ఉపాధ్యాయులు కె.సుజాత, కె.పరదేశి పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల కార్యవర్గం

మాడుగుల రూరల్, నవంరబు 23 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎం.కె.వల్లాపురంలో జిల్లా కార్యదర్శి చంద్రరావు ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఎన్నికలో మండల అధ్యక్షుడిగా జేపీఎస్ కృష్ణ, కార్యదర్శిగా ఎ.అప్పారావు, గౌరవాధ్యక్షుడిగా జగ్గారావు, సహాధ్యక్షుడిగా సత్యనారాయణ, మహిళా సహాధ్యక్షులుగా లావణ్య, కోశాధికారిగా కోటేశ్వరరావుతో పాటు పలువులు సభ్యులను ఎన్నుకున్నారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా కార్యవర్గ ప్రతినిధులు చెప్పారు.

పశువులకు యాంటీబయోటిక్స్ వినియోగంపై రైతులకు అవగాహన

మాడుగుల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పశువులకు యాంటీ బయోటిక్స్ వినియోగంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని పశువైద్య శాఖ సహాయ సంచాలకులు చిట్టినాయుడు స్పష్టం చేశారు. డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ పశువులు, గొర్రెలు, కోళ్లు తదితర మూగజీవాలకు యాంటీ బయోటిక్స్ వినియోగం గురించి తెలుసు కోవాలని చెప్పారు. అలాగే పాలు, మాంసం, గుడ్లు ద్వారా మనుషులకు కలిగే ఇబ్బందులను వివరించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శాస్త్రి, సిబ్బంది జయలక్ష్మి, షర్మిల తదితరులు పాల్గొన్నారు.

సోలార్‌తో విద్యుత్ ఆదా

కె.కోటపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన ద్వారా ప్రతీ ఒక్కరు సోలార్ వినియోగించుకుని విద్యుత్ ఆదా చేసుకోవాలని ఎంపీడీవో సాంబశివరావు సూచించారు. మండల కేంద్రం రెల్లివీధిలో ఉచిత సోలార్ పథకంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ ఎంతో ప్రయోజనకరమన్నారు. అనంతరం సంతబయలు వద్ద స్వచ్ఛత హి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రంశెట్టి భవాని, విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి టి.శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వి.కోటేశ్వరరావు, టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బి.అప్పలరాజు పాల్గొన్నారు.

పాముకాటుతో రైతుకు అస్వస్థత

రావికమతం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పంట పొలం చూసేందుకు వెళ్లిన రైతుకు పాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. చినపాచిల గ్రామానికి చెందిన సాసుబిల్లి రామునాయుడు శనివారం ఉదయం తన వరి పొలానికి నడిచి వెళ్తున్నాడు. పొలం గట్టు గండిలో ఉన్న పామును గమనించక తొక్కడంతో కాలుపై కాటు వేసింది. దీంతో పాము కరిచిందంటూ కేకలు వేస్తూ స్పృహ తప్పి పడిపోయాడు. ఆ ప్రాంతంలో ఉన్న సహచర రైతులు వెంటనే ఆయన్ను రావికమతం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన వైద్య సేవల కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించాలని సూచించారు.

కోళ్ల దొంగ అరెస్టు

రావికమతం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తకోట పరిసర గ్రామాలలో కోళ్లు దొంగిలిస్తున్న వ్యక్తిని శనివారం అరెస్టు చేసినట్టు కొత్తకోట ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. అతని నుంచి ఎనిమిది కోళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇటీవల కిత్తంపేట, టి.అర్జాపురం, దొండపూడి గ్రామాలలో వరుసగా కోళ్లు దొంగతనం జరిగినట్టు తమ దృష్టికి రావడంతో ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. శనివారం కొత్తకోట వారపు సంతలో నిందితుడు దొంగిలించిన కోళ్లు అమ్ముతుండగా పట్టుపడ్డాడని చెప్పారు. అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు.

తూర్పు కాపు సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా మోదునాయుడు

రావికమతం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తూర్పు కాపు సంక్షేమ సంఘ మండల అధ్యక్షుడిగా రావికమతం ఉప సర్పంచ్ జి.మోదునాయుడును నియమించారు. కార్యవర్గ సభ్యులుగా కె.రాజు, గొర్లె దేముళ్లు, జి.శ్రీను, సీతా అప్పారావు, కె.అప్పారావు, పి.గోవింద, ఇందల శివ, కె.రఘు, పి.శ్రీను, వి.ప్రసాద్‌లను నియమించారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

రోలుగుంట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ మండల కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కె.కేశవరావు, అధ్యక్షుడిగా కాళింగ సతీష్, సహాధ్యక్షులుగా బి.భారతి, ప్రధాన కార్యదర్శిగా యు.నాగభూషణం, కోశాధికారిగా డి.అప్పారావు ఎన్నికయ్యారు.

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

నాతవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద చూపాలని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ సూచించారు. మర్రిపాలెం కస్తూర్బాగాంధీ పాఠశాలను శనివారం సందర్శించి మెనూ అమలు తీరును పరిశీలించారు. స్టోర్ రూమ్‌ను పరిశీలించి స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి భవానీ, వీఆర్‌వో శేషు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తా

దేవరాపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తానని ఎంపీడీవో సువర్ణరాజు హామీ ఇచ్చారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా శనివారం బేతపూడి కేజీబీవీ పాఠశాలలో చెత్తాచెదారం తొలగించారు. ఈ సందర్భంగా స్థానికుల విన్నపాల మేరకు ఎంపీడీవో సానుకూలంగా స్పందించారు. ఎస్‌వో మాధురి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లారీ పట్టివేత

మాకవరపాలెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో బాక్సైట్‌ను అధిక లోడుతో రవాణా చేస్తున్న లారీని నర్సీపట్నం ఆర్టీవో అధికారులు పట్టుకొని కేసు నమోదు చేశారు. గంగవరం పోర్టు నుంచి పరిమితి మించి బాక్సైట్ ముడి ఖనిజంతో ఫైనీయర్ కంపెనీకి లారీలు వస్తున్నాయన్న సమాచారంతో వారు నిఘా పెట్టారు. దీంతో ఓ లారీని పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

















పోలీసుల సమస్యల పరిష్కారానికి కృషి

» ఎస్పీ తుహిన్ సిన్హా



సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ తాను కృషి చేస్తానని ఎస్పీ తుహిన్‌సిన్హా పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను కొంతమంది సిబ్బంది ఎస్పీకి వివరించారు.

నీటి సంఘాల ఎన్నికలకు సన్నద్ధం

» ఓటర్లు 19,072 మంది

అనకాపల్లి టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణ, మండల ప్రాంతాల్లో 17 నీటి సంఘాలకు డిసెంబరు ఎనిమిదవ తేదీన జరగబోయే ఎన్నికలకు సర్వం సిద్ధం చేశామని తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. 17 నీటి సంఘాలకు గాను 19,072 మంది ఓటర్ల జాబితాను సిద్ధం చేశామన్నారు. వాస్తవానికి ఈ నెలలో జరగాల్సిన ఎన్నికలు డిసెంబరుకు వాయిదా పడ్డాయన్నారు. 17 పోలింగ్ కేంద్రాల్లో సభ్య రైతులు ఓటు హక్కు వినియోగించుకుంటారన్నారు.

పిల్లల్లో ఫోన్ అడిక్షన్

మారం చేయకుండా అన్నం తింటారనో, అల్లరి చేయకుండా ఉంటారనో... పిల్లల చేతికి సెల్ ఫోన్ ఇస్తున్న తల్లిదండ్రులు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

"మా అబ్బాయికి ఫోన్ ఇవ్వనిదే నోట్లో ముద్ద కూడా పెట్టకోవడం లేదు. ఫోన్ మానిపించడం ఎలాగో అర్థం కావడం లేదు. ఈ అలవాటు వ్యసనంగా మారిపోతోందేమోనని భయమేస్తోంది"...ఇదీ చాలామంది పిల్లల తల్లిదండ్రులు చెప్పేమాట. అందుకు తల్లిదండ్రులే కారణం అంటున్నారు వైద్యులు. అన్నం తింటారనే ఉద్దేశంతోనో, తమ పనులకు అడ్డురారనే కారణంతోనో పిల్లలకు పెద్దలే సెల్‌ఫోన్ అలవాటు చేస్తున్నారని అంటున్నారు. అది మంచిది కాదని, అదే కొనసాగితే భవిష్యత్తులో అనేక రకాల సమస్యలు తలెత్తుతాయని హెచ్చరిస్తున్నారు. అందులో నుంచి పిల్లలను బయటకు తీసుకువచ్చే మార్గాలను సూచిస్తున్నారు. పిల్లల్లో ఫోన్ వినియోగం పెరుగుతున్న తీరు, దానివల్ల కలిగే ఇబ్బందులపై అందిస్తున్న కథనం...

- » అది చాలా ప్రమాదమంటున్న వైద్యులు
- » భవిష్యత్తులో శారీరక, మానసికపరమైన సమస్యలు తలెత్తే అవకాశం
- » దెబ్బతింటున్న కంటి చూపు
- » వెన్ను సంబంధిత సమస్యలు, ఒబెసిటీ...
- » ఫోన్ వ్యసనం నుంచి బయటపడేలా చూడాల్సిన బాధ్యత పెద్దలదేనంటున్న నిపుణులు

తల్లిదండ్రులను చూసే అలవాటు

పిల్లలకు సెల్‌ఫోన్ చూడాలనే కోర్కె మొదటి నుంచి ఉండదు. తల్లిదండ్రులు ఫోన్ పట్టుకుని గంటల తరబడి చూస్తున్నప్పుడు వాళ్ల పక్కనే ఉండి చూడడం ద్వారా అలవాటు పడుతుంటారు. అలాగే పిల్లలు ఏదైనా తినేందుకు మారాం చేసినప్పుడు తల్లిదండ్రులు వారిని సంతృప్తి పరిచేందుకు అడగకపోయినా ఫోన్ ఇస్తుంటారు. సెల్‌ఫోన్ అలవాటుకు అక్కడే బీజం పడుతోంది. ఇదే పనిని ప్రతిరోజూ చేస్తుండడంతో అది క్రమంగా వ్యసనంగా మారుతోంది. కథలు చెబుతూనో, ఏవైనా బొమ్మలు చూపిస్తూనో... అటూ, ఇటూ తిప్పి తినిపించే ఓపిక, సమయం తల్లిదండ్రులకు లేక సెల్‌ఫోన్‌ను ఇస్తున్నారు.

పెను ప్రమాదానికి దారితీసే చాన్స్

సెల్‌ఫోన్ చూడడం అలవాటుగా మారితే భవిష్యత్తులో అనేక సమస్యలు తలెత్తుతాయని నిపుణులు చెబుతున్నారు. ఆహారం తిన్నంత వరకే సెల్‌ఫోన్ చూస్తే పర్వాలేదు. కానీ, పిల్లలు మారాం చేస్తున్నారని, వారి వల్ల పనులకు ఆటంకం కలగకూడదని చెప్పి తల్లిదండ్రులు గంటల తరబడి వారి వద్ద ఫోన్లు వదిలేస్తున్నారు. ఇది అత్యంత ప్రమాదకరంగా చెబుతున్నారు. ఏడాది వయసు నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు ఫోన్లు ఇస్తున్న తల్లిదండ్రులు దానికి చెబుతున్న ఏకైక కారణం...పిల్లాడు చెప్పినట్టు వినడం లేదని, తినడం లేదని, పనికి ఇబ్బంది పెడుతున్నాడని. కానీ, దానివల్ల పిల్లలు భవిష్యత్తులో సెల్‌ఫోన్ అడిక్షన్‌లోకి వెళ్లిపోయే ప్రమాదం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. సెల్‌ఫోన్ స్క్రీన్‌ను పదే పదే టచ్ చేయడం వల్ల నిద్రలో కూడా పిల్లలు చేతిని అలా ఆడిస్తూనే ఉంటారని, మెదడుపై తీవ్రమైన ప్రభావాన్ని చూపించి మానసిక సమస్యలకు దారితీయవచ్చునని హెచ్చరిస్తున్నారు.

ఫోన్‌లోనే ఆనందాన్ని వెతుక్కుంటూ..

ఒకప్పుడు పిల్లలు బయట అనేక రకాల ఆటలు ఆడుకునే వాళ్లు. పట్టణీకరణ వల్ల చిన్నారులు బయట ఆడుకునేందుకు అవకాశం లేకపోవడం, స్కూల్స్‌లో కూడా గ్రౌండ్స్ లేకపోవడంతో క్రీడలకు దూరంగా ఉండిపో తున్నారు. ఇళ్లల్లోనే గంటల తరబడి ఉంటున్న పిల్లలు ఆనందం కోసం ఫోన్, ట్యాబ్ ఎక్కువసేపు వాడుతున్నారు. చిన్న వయసులో గేమ్స్, ఆటలు వీడియోలు చూడడం ద్వారా కోరుకునే ఆనందం వయసు పెరుగుతున్న కొద్దీ రకరకాలుగా మార్పు చెందే ప్రమాదం ఉంది. చిన్న వయసులోనే పోర్న్ చూడడం, బెట్టింగ్, పేకాట వంటివి ఆడడం ద్వారా జీవితాలను నాశనం చేసుకునే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ మధ్య కాలంలో ఇటువంటి కేసులు పెరుగుతున్నాయని పేర్కొంటున్నారు.



బయటపడే మార్గాలు ఇవే..

పిల్లలు ఉన్నప్పుడు తల్లిదండ్రులు కూడా అత్యవసరమైతే తప్ప ఫోన్లకు దూరంగా ఉండాలి. పిల్లల ముందు తల్లిదండ్రులు గంటల తరబడి ఫోన్ పట్టుకుని ఉండడం కూడా వారిపై ప్రభావాన్ని చూపిస్తుంది. ఏవైనా బొమ్మలు కొనిచ్చి వాటితో ఆడుకునేలా చేయడం ద్వారా పిల్లలు అన్నం తినేలా చేయవచ్చు. సెల్‌ఫోన్‌లోనే ఆనందం దొరుకుతుందనే భావనను పిల్లల నుంచి బయటకు తీసేయాలి. ఆ ఆనందాన్ని వాళ్లకు బయట లభించేలా చేయాలి. ఇందుకోసం మైదానాలకు తీసుకువెళ్లి ఆడించడం, డ్యాన్స్ యోగా వంటి తరగతుల్లో చేర్పించడం చేయాలి. పిల్లలను శారీరక శ్రమ కలిగించే కార్యక్రమాల్లో భాగం చేయడం ద్వారా మాత్రమే ఈ తరహా అలవాట్లకు దూరంగా ఉంచేందుకు అవకాశం ఉంటుంది.

అనారోగ్య సమస్యలు..

ఫోన్ అధికంగా వినియోగించే చిన్నారుల్లో సోషలైజేషన్ పూర్తిగా దెబ్బతింటుంది. దీని వల్ల పిల్లలు అన్ని విషయాల్లోనూ వెనుకబడిపోతారు. ఏకాగ్రత లోపిస్తుంది. సెల్‌ఫోన్ రేడియేషన్ వల్ల పలు ఇబ్బందులు ఎదురు కావచ్చు. యూవీ కిరణాలు పిల్లల కళ్లను దెబ్బతీస్తాయి. కంటిలోని సున్నితమైన రెటీనాపై ప్రభావం చూపే అవకాశం ఉంది. సెల్‌ఫోన్ స్క్రీన్ వెలుతురుతో కంటి చూపు క్రమంగా తగ్గుతుంది. కొందరు చిన్నారులు ఫోన్‌తో ఎక్కువ సమయం గడపడం వల్ల మాటలు కూడా మరిచిపోతున్నారని, తల్లి దండ్రులు కూడా దీన్ని గుర్తించలేకపోతున్నారని నిపుణులు చెబుతున్నారు. ఇది అత్యంత ప్రమాదకరమైన సమస్యగా మారుతోందంటున్నారు. అదే పనిగా కూర్చుని ఫోన్ చూడడం వల్ల వెన్ను సంబంధిత సమస్యలు, ఒబెసిటీ ఇబ్బందులు వేధిస్తాయి. ఇంకా గందరగోళం, ఆలోచనా శక్తి తగ్గడం వంటి సమస్యలు కూడా వస్తాయి. తెలివితేటలు మందగించవచ్చు. 13 నుంచి 18 ఏళ్ల మధ్య వయస్కులు సెల్‌ఫోన్ అతి వినియోగంతో డిప్రెషన్, తీవ్రమైన ఒత్తిడి వంటి వాటితో ఇబ్బందిపడుతున్నారు. ఈ వయసు వారు ఎక్కువగా గేమ్స్ ఆడడంతోపాటు చూడకూడని వెబ్‌సైట్లకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు పలు అధ్యయనాలు వెల్లడించాయి.



పిల్లల భవిష్యత్తు తల్లిదండ్రులు చేతుల్లోనే

- డాక్టర్ జి.భాగ్యారావు, మానసిక వైద్య నిపుణులు



చిన్నారుల సెల్‌ఫోన్ వినియోగం అసాధారణ రీతిలో పెరిగింది. ఏడాది నుంచి ఆరేళ్ల పిల్లల వరకూ అన్నం తినాలంటే తప్పనిసరిగా ఫోన్ ఇవ్వాల్సిన దుస్థితి నెలకొంది. దీనికి బాధ్యత తల్లిదండ్రులే వహించాలి. వీటి నుంచి బయటపడే మార్గాలను వారే చూడాలి. మైదానాలకు తీసుకువెళ్లడం, ఆటల్లో భాగస్వామ్యం చేయడం, మ్యూజిక్, యోగా, డ్యాన్స్ వంటి కోర్సుల్లో చేర్పించడం ద్వారా ఇటువంటి వాటికి దూరం చేయవచ్చు. అలా చేస్తే పిల్లలు కూడా ఆరోగ్యంగా ఉంటారు. గతంలో తాత, నానమ్మ వద్ద చేరి పిల్లలు కథలు వినేవారు. ఇప్పుడు అటువంటి చెప్పేవారు ఇళ్లల్లో లేరు. తల్లిదండ్రులు బిజీ జీవితాన్ని గడుపుతున్నారు. దీంతో పిల్లలకు తల్లిదండ్రులే స్వయంగా ఫోన్లు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు. పదేళ్ల వయసు వచ్చేసరికి పిల్లల్లో ఫోన్ వినియోగం వ్యసనంగా మారుతోంది. అలవాటు పరిధి దాటితే ఎవరూ చెప్పినా ప్రయోజనం ఉండదు. కొన్నిసార్లు మందులు వినియోగించి మాన్పించే స్థాయికి కూడా పిల్లలు వెళ్లిపోతారు. మానసిక రోగాలకు ఈ అలవాటు కారణం అవుతుంది.

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టంపై అవగాహన కల్పించాలి

» ఆర్డీవో కుమారి షేక్ అయేషా

కొత్తూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గర్భస్థ పిండ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం-1994పై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలని అనకాపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారిణి కుమారి షేక్ అయేషా సూచించారు. శనివారం ఆర్డీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ స్త్రీ, పురుష లింగ నిష్పత్తి తక్కువగా నమోదవుతున్న మునగపాక, అచ్యుతాపురం, బుచ్చెయ్యపేట, రాంబిల్లి మండలాల్లో ప్రధానంగా మత్స్యకార గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను, ప్రభుత్వ హాస్టల్స్‌లో ప్రవేశాలు, ఆడబిడ్డ పెంపకం భారం కాదనే అంశాలను క్షుణ్ణంగా వివరించాలని సూచించారు. సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మృణాళిని మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం -1994 కింద ప్రస్తుతం ఎటువంటి కేసులు నమోదు కాలేదని చెప్పారు. స్కానింగ్ సెంటర్ల తనిఖీ, విధి విధానాలు, డెకాయ్ నిర్వహణ తీరు, పోలీసు, రెవెన్యూ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ భాగస్వామ్యం కావాలన్నారు. చట్టం ద్వారా తీసుకునే కఠిన చర్యలపై పోస్టర్లను ఆయా సెంటర్లలో ప్రదర్శించాలన్నారు. రికార్డులు, రిపోర్టుల నిర్వహణపై తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో సబ్ డివిజనల్ పీసీపీఎన్‌డీటీ నోడల్ అధికారి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ చంద్రశేఖర్‌దేవ్, లయన్స్ క్లబ్ సభ్యులు, న్యాయ నిపుణులు ఇమ్మానుయేల్ మైఖేల్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో కుమారి షేక్ అయేషా

ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

» పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్

సబ్బవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్ కోరారు. మండలంలోని పలు పాఠశాలలను సందర్శించిన ఆయన పీఆర్‌టీయూ సభ్యత్వాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీల్లో పారదర్శకత పాటించి మైదాన ప్రాంతం నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయలను తిరిగి మైదాన ప్రాంతాలకు బదిలీ చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యద ర్శులు అప్పలనాయుడు, భాస్కర్, సత్యం నాయుడు, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డి.గోపీనాథ్

పరాయి పంచన ప్రభుత్వ కార్యాలయాలు

... 5వ పేజీ తరువాయి

ఐదు ఎకరాల స్థలం అవసరమని అధికారులు అంటున్నారు.

ఎక్సైజ్ కార్యాలయంలో ఇబ్బందులు

ఎక్సైజ్ కార్యాలయాన్ని నర్సీపట్నం-చింతపల్లి రోడ్డులోని ఓ అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ సీఐ, ఎస్ఐతో పాటు సిబ్బంది పని చేయడానికి సరిపడా స్థలం లేదు. వరండాలో రెండు కంప్యూటర్లు పెట్టుకొని ఆఫీసు పని చేసుకుంటున్నారు. గంజాయి, నాటు సారా కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు ఉంచడానికి జాగా లేక మెయిన్ రోడ్డుకి ఇరువైపులా పార్కింగ్ చేశారు. కార్యాలయం ఆవరణ, పక్కనే ఉన్న ప్రైవేటు స్థలంలో కార్లు, ఆటోలు, లారీలు గుట్ట గుట్టలుగా పేర్చి పెట్టారు. నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి షియాజ్‌ఖాన్ రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలను వెంటనే తీయించాలని ఎక్సైజ్ అధికారులకు లిఖిత పూర్వంగా ఆదేశాలు జారీ చేశారు. వీటిని ఎక్కడికి తరలించాలో అర్థంకాని పరిస్థితి ఉంది.

గృహ నిర్మాణ శాఖ కార్యాలయం

డివిజనల్ గృహ నిర్మాణ శాఖ కార్యాలయాన్ని పెదబొడ్డేపల్లి వంతెన సమీపంలో అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఈఈ, డీఈ, సిబ్బంది పని చేయడానికి సరిపడా గదులు లేవు. డివిజన్ స్థాయిలో ఏఈలతో సమావేశం నిర్వహిద్దామంటే హాలు లేదు. అధికారుల కార్లు, సిబ్బంది బైక్‌లు పెట్టుకోవడానికి స్థలం లేక బయట పార్కింగ్ చేసుకుంటున్నారు.

గనుల శాఖదీ అదే పరిస్థితి

పెదబొడ్డేపల్లి- చోడవరం రోడ్డులో డివిజనల్ గనులు, భూగర్భ శాఖ, తూనికలు కొలతలు శాఖ కార్యాలయాలను అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఏడీ, ఏజీ, సూపరింటెండెంట్, సిబ్బందికి సరిపడా గదులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ కూడా అధికారుల కార్లు, సిబ్బంది బైక్‌లు పెట్టుకోవడానికి స్థలం లేక రోడ్డు మీద పార్కింగ్ చేసుకుంటున్నారు. ఏళ్ల తరబడి అద్దె భవనాల్లో కార్యాలయాలను నిర్వహించడం వల్ల అద్దెల రూపంలో లక్షలాది రూపాయల ప్రభుత్వ నిధులు ప్రతి ఏటా ఖర్చవుతున్నాయి. అలా కాకుండా ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, ఎంపీడీవో కార్యాలయాల ఆవరణలో నిరుపయోగంగా ఉన్న స్థలాలను ఈ భవనాలకు కేటాయిస్తే సమస్య పరిష్కారం అవుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేయాలి

... 5వ పేజీ తరువాయి

మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ విశాఖపట్నంలో జరిగే బహిరంగ సభలో ప్రసంగించనున్నారని తెలిపారు. అనకాపల్లి జిల్లా పూడిమడకలో ఎన్టీపీసీ, జెన్‌కో ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుకు వర్చువల్ విధానంలో భూమిపూజ చేయనున్నారని తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన కోట్లాది రూపాయలకు సంబంధించి వైసీపీ ప్రభుత్వం నిధుల వినియోగ పత్రాలను (యూసీలను) పంపలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులు దుర్వినియోగమయ్యాయని ఆరోపించారు. దేశంలో ఎన్‌డీఏ ప్రభుత్వ పాలనకు మహారాష్ట్రలోని ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడిన తరువాత వికసిత్ భారత్ లక్ష్యంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల అభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నారన్నారు. సమావేశంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు, పంచకర్ల రమేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేశ్, చిత్రంలో ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేశ్‌బాబు, కేఎస్ఎన్ఎస్ రాజు

క్రైం... crime news

46 పశువులు స్వాధీనం

» రెండు వ్యాన్లు సీజ్

నక్కపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు హైవే టోల్‌ప్లాజా వద్ద రెండు వ్యాన్లలో తరలిస్తున్న 46 పశువులను శనివారం నక్కపల్లి పోలీసులు పట్టుకున్నారు. గోవులను అక్రమంగా రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు నేతృత్వంలో సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. విజయనగరం నుంచి కాకినాడ జిల్లా తునికి రెండు వ్యాన్లలో 46 గోవులను బంధించి తరలిస్తుండగా పట్టుకున్నామని, ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ సన్నిబాబు చెప్పారు. స్వాధీనం చేసుకున్న పశువులకు పశువైద్యాధికారితో పరీక్షలు జరిపి, గోశాలకు తరలించినట్టు చెప్పారు.



పశువులతో పాటు స్వాధీనం చేసుకున్న వ్యాన్

గంజాయితో ముగ్గురి అరెస్టు

నాతవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గం జాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ సీహెచ్ భీమరాజు తెలిపారు మండలంలోని తాండవ సెంటరులో శనివారం అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకుని విచారించగా.. వారి వద్ద ఉన్న బ్యాగ్‌లలో 14 కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. వారిలో ఒకరు అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందినవారు కాగా, మరో ఇద్దరు తమిళనాడు రాష్ట్రానికి చెందినవారని ఎస్ఐ భీమరాజు తెలిపారు.

అన్నదాతల్లో గుబులు

... 5వ పేజీ తరువాయి

వదులుకోవలసిందేనని వాపోతున్నారు. ఈ ఏడాది వరి పంట ఆశాజనకంగా ఉందని రైతులు సంతోషపడుతున్న తరుణంలో రెల్లరాల్చు పురుగు పంటను నాశనం చేస్తోంది. పంట చేతికి వచ్చే దశలో రెల్లరాల్చు పురుగు సమస్య భయపెడుతోంది. గింజ గట్టిపడే దశలో వెన్నులను కొరికిపడేస్తుందని రైతులు వాపోతున్నారు. అయితే పురుగు తీవ్రత అంతా రాత్రి సమయాల్లో చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది కొరికి వేయడంతో వెన్నులు నేలరాలుతున్నాయి. ఇప్పటికే రైతులు చివరిదశలో కూడా మరోసారి మందులు పిచికారీ చేస్తున్నారు.

నివారణ మందు పిచికారీ చేయాలి

ప్రస్తుతం వరి పంటకు రెల్లరాల్చు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంది. గింజ గట్టి పడే సమయంలో వెన్నులు కొరికి వేయడంతో పంటకు తీవ్ర నష్టం కలుగుతుంది. రాత్రి సమయాల్లో దీని ప్రభావం ఎక్కువగా ఉంటుందని మండల వ్యవసాయాధికారి చిరంజీవి తెలిపారు. దీని నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీ లీటర్లు మందును ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అలాగే ఇమామేక్టిన్‌బెంజోయేట్ పురుగు మందు 100 గ్రాముల పొడిని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. తుఫాన్ కారణంగా రైతులు వరిచేను కోతలు ప్రస్తుతం నిలిపివేయాలని ఆయన సూచించారు.

పింఛన్‌దారులకు భరోసా

... 5వ పేజీ తరువాయి

తీసుకుంటున్న 2,59,778 మందిలో ప్రతి నెలా సుమారు 600 నుంచి 800 మంది వరకు మృతి చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పేదింటి పెద్ద మృతి చెందినా ఇక ముందు ఆర్థిక భరోసా అందనుంది. ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయ్యాయని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి తెలిపారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	580
విజయనగరం	584
శ్రీకాకుళం	584